# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

15.10.2025 బుధవారం Wednesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 115 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




## కదులుతున్న బస్సులో మంటలు

### ప్రయాణికుల్లో 15మంది సజీవ దహనం

జైసల్మేర్, అక్టోబర్ 14: రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో మంగళవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తైయాట్ ప్రాంతంలోని మిలటరీ స్టేషన్ సమీపంలో కదులుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి 15 మంది సజీవదహనమయ్యారు. మరో 25 మంది గాయపడ్డారు. బస్సులోంచి దట్టమైన పొగలు రావడంతో డ్రైవరు వెంటనే బస్సులు నిలిపివేశారు. నేషనల్ హైవేపై బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకోవడం తో కిలోమీటర్ల వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని ఆర్మీ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి చుట్టుపక్కలకు మంట లు విస్తరించకుండా వెంటనే అదుపులోనికి తెచ్చాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిప్రమాదానికి కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు.

## పూరన్ ఆత్మహత్యపై సత్వర దర్యాప్తు



- ఉన్నతస్థాయిలో కూడా దళితులకు స్వేచ్ఛ కరవు
- పూరన్ కుటుంబ సభ్యులకు రాహుల్ పరామర్శ

04

## మావోయిస్టు అగ్రనేత మల్లోజుల అస్త్రసన్యాసం

### మహారాష్ట్ర సీఎం సమక్షంలో 60మందితో కలిసి లొంగుబాటు

వీరిలో సీసీ సభ్యుడు రూపేష్, ముగ్గురు డీకేఎస్ జడ్జీ సభ్యులు

మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ

పార్టీ అనుసరిస్తున్న తీరుపై కొంతకాలంగా అసంతృప్తి



తెలంగాణకు చెందిన తిప్పిరి తిరుపతి నంబాల తర్వాత మావోయిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన క్రమంలో మల్లోజుల అస్త్ర సన్యాసం తీసుకుని పోలీసులు ఎదుట లొంగిపోవడం మావోయిస్టు పార్టీలో ప్రకంపనలు రేపుతోంది. మల్లోజుల వేణుగోపాల్ రావు సోదరుడు మల్లోజుల కోటేశ్వర్ రావు కిషన్ జీ కూడా మావోయిస్టు పార్టీ అగ్రనేతనే. బెంగాల్ ఎన్ కౌంటర్‌లో చనిపోగా, ఆయన భార్య మైనక్క కూడా ఇటీవలే తెలంగాణ పోలీసులు ముందు లొంగిపోయారు. ఓ వైపు ఆపరేషన్ కగార్‌తో దిక్కుతోచని స్థితిలో ఉన్న మావోయిస్టు పార్టీకి.. పార్టీ అగ్రనేతలు కొందరు ఎన్ కౌంటర్‌లో చనిపోవడం, ఇంకొందరు పోలీసులు ముందు లొంగిపోవడంతో పార్టీ చరిత్రలో ఇప్పటి వరకు చూడని సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది.

మిగతా 2 లో



## హైకోర్టు ఏకపక్ష స్టే

రిజర్వేషన్ల ఆశలపై నీళ్లు చల్లారు

బంద్‌తో బీసీల ఆకాంక్షను వెల్లడిస్తాం

బంద్ పోస్టర్ ఆవిష్కరణలో ఆర్. కృష్ణయ్య

2

## లక్షా 30 వేలు



సామాన్యులకు చుక్కలు చూపుతున్న బంగారం

సంపన్నులను కలవర పెడుతున్న ధరలు

లక్షా 30 వేలు దాటేసిన బంగారు తులం ధర

2

## గురుకులాలకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు



రేవంత్ మాటలు నమ్మశక్యంగా లేవు

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

3

## 18న గ్రూప్-2 విజేతలకు నియామక పత్రాలు



సీఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత

ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన సీఎస్ రామకృష్ణారావు

2



## బనకచర్లపై ఏపీని నిరోధించండి

2

### కేంద్రానికి మరోమారు తెలంగాణ లేఖ

పోలవరం– బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో గుర్తు చేశారు.

## అడిగిన సమాచారం ఇవ్వాల్సిందే

3



ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావుకు సుప్రీం ఆదేశం

## ఇరిగేషన్‌శాఖలో భారీగా బదిలీలు

- 106మంది ఇంజినీర్ల ట్రాన్స్‌ఫర్
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

2




## సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు



2

- హైకోర్టు తీర్పు తమకు నిరాశ కలిగించింది
- ఎస్ఎల్‌పి విచారణ రేపు వచ్చే ఛాన్స్
- మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి

పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.



2

## పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

కుటుంబ కలహాలే కారణం

## గురుకుల కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య

వివరాలు 2లో

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలు...





## పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**హైదరాబాద్, అక్టోబర్ 14:** హైదరాబాద్ బాలానగర్ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులను హత్య చేసి, ఆ తర్వాత భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో మృతురాలును చల్లారి సాయిలక్ష్మి (27)గా గుర్తించారు. ఆమె భర్త అనిల్ కుమార్ తో కలిసి పద్మారావు నగర్ ఫేజ్-1, బాలానగర్ లో నివాసం ఉంటోంది. సాయిలక్ష్మికి ఇద్దరు కవల పిల్లలు చేతన్ కార్తికేయ, లాస్యతవల్లి ఉన్నారు. తాజాగా అందిన సమాచారం మేరకు గత కొంతకాలంగా భర్తతో వచ్చిన కుటుంబ విభేదాలు, వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన సాయిలక్ష్మి, ఆవేశంతో తన ఇద్దరు పిల్లలను చంపి అనంతరం బిల్డింగ్ పై నుంచి దూకి ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## గురుకుల కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 14:** జిల్లాలో విషాదం నెలకొంది. ఈ చదువు చదవలేక పోతున్నానని నోట్ రాసి గురుకుల కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అయితే ప్రేమ వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గద్వాల జిల్లా మల్దకల్‌కు చెందిన ఉప్పరి నగేశ్ కుమార్తె ప్రియాంక (17) మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడ సోషల్ వెల్ఫేర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. సోమవారం బాత్‌రూంలోని కిటికీకి ప్రియాంక ఉరివేసుకుంది. ఇది గమనించిన తోటి విద్యార్థులు కాలేజీ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వెంటనే వారు ఆస్పత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున ప్రియాంక మృతిచెందింది. హాస్టల్‌లో ఉండటం తనకు ఇష్టం లేదని మూడు రోజుల క్రితం ప్రియాంక తన తల్లిదండ్రులకు ఫోన్ చేసింది.. అయితే అక్కడకే ఉండి చదువుకోవాలని ఆమె తండ్రి చెప్పాడని పోలీసులకు తోటి విద్యార్థులు తెలిపారు.

## నీటిపాదరుదల శాఖలో కుదపు

### 106మంది ఇంజనీర్ల తక్షణ బదిలీ

హైదరాబాద్, అక్టోబర్ 14: నీటిపారుదల శాఖలో అవినీతి అధికారుల వ్యవహారం కలకలం రేపుతున్న తరుణంలో ..హైదరాబాద్ సర్కిల్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 106 మంది ఇంజినీర్లను బదిలీ చేస్తూ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌వోసీల జారీ విషయంలో ఇంజినీర్లపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. బదిలీ అయిన ఇంజినీర్లలో ఈఈలు, డీఈఈలు, ఏఈఈఈలు ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణలతోపాటు, క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో సమూల ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం క్షేతస్థాయి ఇంజినీర్లను బదిలీ చేసింది. హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికిపైగా ఇంజినీర్లపై బదిలీ వేటు వేయడం గమనార్హం. వీరంతా ఒకేచోట తిష్టవేసి అక్రమలకు పాల్పడుతున్నారని ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో వీరిని బదిలీలతో సమస్యకు చెక్ పెట్టాలని చూస్తోంది.

## అడిగిన సమాచారం ఇవ్వాల్సిందే

### ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావుకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సిట్ అధికారులు అడిగిన సమాచారం ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో క్లౌడ్, యాపిల్ క్లౌడ్ సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. యూజర్, పాస్‌వర్డ్‌ల సమాచారం ఇవ్వాలని జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఆదేశించింది. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సమాచారం తీసుకోవాలని సిట్‌కు సూచించింది. సమాచారం చెరిపేందుకు యత్నించినట్లు తేలితే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని కోర్టు పేర్కొంది. ఈ మేరకు ఈ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ డీఎ స్పీ ప్రభాకర్‌రావు సిట్ అధికారులు కోరిన సమాచారాన్ని తప్పనిసరిగా అందించాలంటూ సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేస్తూ, దర్యాప్తు పక్రియలో సహకరించడం ప్రతి నిందితుడి బాధ్యత. సిట్ అడిగిన వివరాలు ఇవ్వకపోవడం చట్టవిరుద్ధం, అని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా ప్రభాకర్ రావు తన క్లౌడ్ డేటా, అలాగే యాపిల్ క్లౌడ్‌లో ఉన్న సమాచారం మొత్తం సిట్‌కు అందించాలన్నది కోర్టు స్పష్టం చేసింది. అదేవిధంగా, ఆన్‌లైన్ ఖాతాలకు సంబంధించిన యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లు కూడా సిట్ అధికారులు పొందేలా చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, ఆ సమాచారం సేకరణ సమయంలో ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరిగా హాజరై ఉండాలని కూడా కోర్టు సూచించింది. ఇది దర్యాప్తు పారదర్శకతను నిర్ధారించడమేనని పేర్కొంది. తద్వారా, సిట్ అధికారులు ఫోరెన్సిక్ బృందం సమక్షంలో డిజిటల్ ఆధారాలను సేకరించి దర్యాప్తును కొనసాగించవచ్చు. ప్రభాకర్ రావు లేదా ఇతర నిందితులు ఆ సమాచారాన్ని చెరిపేందుకు లేదా మార్చేందుకు యత్నించినట్లు తేలితే, ఆ అంశంపై తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ తీర్పు సిట్ దర్యాప్తుకు మరింత బలం చేకూర్చనుంది. డిజిటల్ ఆధారాలు సేకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన మార్గదర్శకాలు, ఈ కేసులో కొత్త మలుపు తిప్పే అవకాశముందని న్యాయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

## బనకచర్లపై ఎపిని నిరోధించండి

**హైదరాబాద్,అక్టోబరు14 :** పోలవరం- బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో గుర్తు చేశారు. డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే, నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం - బనకచర్ల విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా నిలువరించాలని కోరారు. టెండర్, భూసేకరణ విషయంలో ముందుకెళ్లకుండా చూడాలని కోరారు.

# మావోయిస్టు అగ్రనేత మల్లోజుల అస్త్రసన్యాసం

**ముంబై, అక్టోబర్ 14:** మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన పోలీసులకు లొంగిపోయారు. కొద్దిరోజుల కిందట తన సోదరుడు మల్లోజుల కోటేశ్వరరావుకు కిషన్‌జీ పేరుతో వేణుగోపాల్‌రావు ఒక లేఖ రాశారు. అందులో మావోయిస్టు పార్టీ విధానాలపై వేణుగోపాల్‌రావు కొంతకాలంగా అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతంగా నడిపించడానికి బహిరంగంగా ప్రజల్లోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదంటూ మావోయిస్టు పార్టీకి ఆయన రాసిన మరో లేఖ కలకలం రేపింది. దాని తర్వాత ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. అనివార్య కారణాలతో పార్టీని వీడుతున్నానని.. ఇకపై పార్టీలో కొనసాగబోనని ప్రకటించారు. ఈ క్రమంలోనే 60 మందితో కలిసి గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు. ఆయన రాసిన లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. నిన్నటి పొరపాట్లను విశ్లేషించుకోవడం ద్వారా నేడు, రేపు వాటిని నివారించడం ఎలాగో మనం నేర్చుకుంటాం. తప్పుల నుంచి గుణపాఠాలు తీసుకోవడం రోగం రాకుండా టీకా తీసుకోవడం వంటిది. విప్లవోద్యమాన్ని కూడా అదే తీరుగా నడిపించగలుగుతాం. ఇది నల్లేరు మీద బండిలా సాగే పని ఎంతమాత్రం కాదు. తీవ్రమైన అధ్యయనం, ఓపికతో, త్యాగాలతో కూడిన విప్లవాచరణ' అని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీకి ఆయన 22 పేజీలతో కూడిన సుదీర్ఘ లేఖను ఈ నెల 6వ తేదీన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీలో తీవ్రమైన అంతర్గత సంక్షోభం ఉన్నదని, ఆయుధ పోరాటాలను తాతాలికంగా విరమించాలని ఆ లేఖలో కోరారు. దశాబ్దాల తరబడి తప్పుడు విధానాలే తీవ్రమైన నష్టాలకు కారణమని, 'సైన్యం తప్ప రహస్య పార్టీ లేదు' అని ఆయన ఖరాకండిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాతాలికంగా సాయుధ పోరాటాన్ని విరమించి, ప్రజల మధ్యకు బహిరంగంగా వెళ్లాలని ఆయన క్యాడర్‌ను కోరారు. పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించిన మౌలికమైన తప్పిదాలను సరిదిద్దుకోవడానికి సైన్యంతో ఉంటే సాధ్యం కాదని వేణుగోపాల్ స్పష్టం చేశారు. 'విప్లవపార్టీ లేకుండా విప్లవమే లేదు' అనే లెనిన్ సూత్రాన్ని విస్మరించడం వల్ల, మావోయిస్టులకు సైన్యం తప్ప రహస్య పార్టీ లేని స్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతమున్న ఏసీ, డీవీసీ వంటి పార్టీ కమిటీలన్నీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వెంట, సైనిక దుస్తులలో సాయుధులుగా ఉండటం బహిరంగ రహస్యమేనని అన్నారు. వీటిని శత్రువుకు అబేధ్యమైన రహస్య పార్టీ నిర్మాణాలుగా పరిగణించలేమని, ఇదే బలహీనత శత్రువుకు పార్టీని నిర్మూలించేందుకు పూర్తి అవకాశాన్ని ఇచ్చిందని పేరొన్నారు. 2007లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో దండకారణ్యం, బీహార్-జార్ఖండ్‌లలో బేస్ ఏరియాలను నిర్మించే కేంద్ర కర్తవ్యాన్ని చేపట్టడం రెండో వ్యూహాత్మక తప్పిదమని వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ బలాన్ని అతిగా అంచనా వేసి, శత్రువు బలాన్ని తకువ చేసి చూశామన్నారు. 2011 నుండే కిందిస్థాయి కామ్రేడ్స్ ఈ తప్పును సరిదిద్దుకోవాలని కోరినప్పటికీ, సీసీ పట్టించుకోలేదని అన్నారు. ఒక దశాబ్దం పాటు నష్టపోయామని తెలిపారు. ఇప్పటికైనా అమరుల రక్తతర్పణం నుండి గుణపాఠాలను తీసుకుందామని పేర్కొన్నారు. రహస్య, చట్టబద్ధ పోరాటాల మధ్య సమన్వయాన్ని కొనసాగించడంలో సెంట్రల్ కమిటీ పూర్తిగా విఫలమైందని ఇది మూడో తప్పిదమని వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. 2006 నూతన అటవీ చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చే భూమి పట్టాలను 'బేస్ ఏరియాలు నిర్మిస్తున్నామనే ధీమాతో' వ్యతిరేకించాం. దండకారణ్యంలోని రైతులకు మన జనతన సరార్‌లే పట్టాలిస్తాయని చెప్పాం, కానీ ఆ పట్టాలకు వ్యవస్థలో గుర్తింపు లేదనే ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను విస్మరించామని తెలిపారు. ప్రజలు తమ జీవితావసరాల కోసం అనివార్యమైన ఆధార్ కార్డులు తెచ్చుకోవడాన్ని కూడా పార్టీ వ్యతిరేకించడం, ప్రజలు దొంగచాటుగా ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లి వాటిని పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేరొన్నారు. 'ఇప్పుడు మనకు సానుకూల మార్పు కావాలి. ఉద్యమాన్ని కాపాడుకోవడం, క్యాడర్‌ను రక్షించుకోవడం కావాలి. అనవసర త్యాగాలకు అంతం పలుకుదాం. నూతన పద్ధతులలో పురోగమిద్దాం. అంతిమ విజయం ప్రజలదే' అంటూ మల్లోజుల తన లేఖను ముగించారు. తాను కేంద్ర కమిటీలో 28 ఏండ్లు, పొలిట్ బ్యూరోలో 18 ఏండ్లు సభ్యుడిగా ఉన్నట్టు మల్లోజుల తెలిపారు. ప్రస్తుతం ఉద్యమం ఎదురొంటున్న వైఫల్యాలకు, భారీ నష్టాలకు నైతిక బాధ్యత వహిస్తూ, యావత్ పార్టీ క్యాడర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. ఇంతటి నష్టాలకు దారితీసిన నాయకత్వంలో కొనసాగడానికి అనర్హుడిని అని ప్రకటించారు. గతంలో దివంగత ప్రధానకార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (నంబాల కేశవరావు) కూడా ప్రభుత్వంతో శాంతి చర్చల పక్రియను




ప్రారంభించారని, ఏప్రిల్ 2025 నాటికి ఈ నిర్ణయం అనివార్యమని భావించారని గుర్తు చేశారు.



## సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు

### హైకోర్టు తీర్పు తమకు నిరాశ కలిగించింది.. ఎస్ఎల్‌పి విచారణ రేపు వచ్చే ఛాన్స్

### మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు. ఇదిలావుంటే బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈ నెల 9వ తేదీన హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఈ ఎస్ఎల్‌పీ పిటిషన్ వేసింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేవని ఎస్ఎల్‌పీలో తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందనీ పిటిషన్‌లో పేర్కొంది. ప్రత్యేక సందర్భాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం తెలంగాణలో జరిగిందని.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024-25లో రాష్ట్ర జనాభాలో 56.33శాతం మంది బీసీలు ఉన్నారని తెలిపింది. రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావించింది. ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్ ,రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే వాటికి ఆమోదముద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుందని.. ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలంటూ పిటిషన్ లో పేర్కొంది. న్యాయం తమవైపు ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. సుప్రీంలో తప్పకుండా అనుకూల తీర్పు వస్తుందని అన్నారు.

### లక్షా 30 వేలు దాటేసిన

## బంగారు తులం ధర

**హైదరాబాద్, అక్టోబర్ 14:** సామాన్యులను దూరం చేసుకుంటున్న బంగారం సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.30 లక్షలు దాటి పరుగులు పెడుతోంది.మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది.మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చన్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి. అటు వెండి ధర కూడా భారీగా పెరుగుతోంది. దాదాపు రూ.2 లక్షలకు చేరువైంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,85,763గా ఉంది. అంతర్జాతీయ విపణిలోనూ పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. ఔన్సు ధర 4,115 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 51 డాలర్లు దాటింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, ధనత్రయోదశితో పాటు రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

### సీఎం రేవంత్ చేతుల మీదుగా శిల్పకళా వేదికలో అందచేత

### ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన సీఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్,అక్టోబరు14:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. 18 తేదీ సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో సచివాలయంలో మంగళవారం సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సీఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవిన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్‌లో ఉంటారు కాబట్టి, వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..
బుధవారం 15 అక్టోబర్ 2025 కరీంనగర్ 3

# గురుకులాలాలకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు

- రేవంత్ మాటలు నమ్మశక్యంగా లేవు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, అక్టోబరు 14:** గురుకులాకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు విడుదల చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలేనా? అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కమిషన్‌లు రావనే ఆయన గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా..? అని విమర్శించారు. హామీలతో మభ్యపెట్టడం, ఆ తర్వాత మాట మార్చడమే రేవంత్ అనుసరిస్తున్న సిద్ధాంతమా..? అని నిలదీశారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. 'రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన ఉండదనడానికి గురుకులాలకు కేటాయించిన చాలీచాలని నిధులే ఉదాహరణ. రాష్ట్రంలోని 1024 గురుకులాలకు కేవలం రూ.60 కోట్లు కేటాయించి, గోరంతను కొండంతగా చెప్పుకోవడం సిగ్గుచేటు. రూ.12 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేసుకుంటున్న రేవంత్ రెడ్డికి ఆరున్నర లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బిడ్డలు చదివే గురుకులాలకు కనీసం రూ.100 కోట్లు కేటాయించే మనసు లేదా..?' అని ప్రశ్నించారు. 'కమిషన్లు రావనే గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా? మీరు కేటాయించిన చాలీచాలని నిధులతో సిబ్బంది వేతనాలు, మోటార్ల మరమ్మతులు, అత్యవసర పనులు ఎలా సాధ్యం? చిత్తశుద్ధిలేని సమీక్షలతో గురుకులాలకు ఏం ప్రయోజనం? ఒకవైపు సమస్యల వలయంలో గురుకులాలు కొట్టుమిట్టాడుతుంటే తూతూమంత్రంగా సమీక్ష నిర్వహించడం దుర్మార్గం. గురుకులాలకు నిత్యావసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు? పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు, స్టిచ్చింగ్ ఛార్జీలు ఎప్పుడిస్తారు? అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు అ÷-దదె బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? నెలలుగా పెండింగ్‌లో ఉన్న తాత్కాలిక సిబ్బంది వేతనాలు ఎప్పుడిస్తారు?' అని హరీశ్‌రావు నిలదీశారు. గురుకులాల మీద ప్రభుత్వానికి పట్టింపు ఉంటే విద్యార్థులు ఎందుకు నిరసనలు తెలియజేస్తున్నారు? బడిబాట పట్టాల్సిన విద్యార్థులను, ఆందోళన బాట పట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ రెడ్డీ మీ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతిని దిగజార్చారు. విష వలయాలుగా మార్చారు. అపఖ్యాతిని మూటగట్టుకున్నారు' అని మండిపడ్డారు. 22 నెలలుగా గురుకులాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై అవసరమైన నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చింది

- రిజర్వేషన్ల ఆశలపై నీళ్లు చల్లారు
- బంద్‌తో బీసీల ఆకాంక్షను వెల్లడిస్తాం
- బంద్ పోస్టర్ ఆవిష్కరణలో ఆర్. కృష్ణయ్య



**హైదరాబాద్, అక్టోబరు 14:** బీసీల వాదన వినకుండా తెలంగాణ హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందని బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి కన్వీనర్ ఆర్ కృష్ణయ్య వ్యాఖ్యానించారు. తామంతా రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో నోటికాడ బుక్క ఎత్తిపోయిందన్నారు. ఇది తమను ఎంతగానో ఆందోళనకు గురిచేసిందన్నారు. మంగళవారం బీసీ సంఘాల తెలంగాణ బంద్ పోస్టర్స్‌ని ఆర్.కృష్ణయ్య, కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్స్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం జరుగలేదని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇచ్చి బీసీల నోటికాడి ముద్దను లాక్కుందని విమర్శించారు. బీసీలకు అవమానం, అన్యాయం జరిగిందని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘాలు చెప్పిన అంశాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బీసీ బంద్‌కి ఇప్పటికే సంపూర్ణ మద్దతు ప్రకటించామని కోదండరాం పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్స్‌ని అడ్డుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించే తెలంగాణ బంద్‌కి సంపూర్ణ మద్దతు తెలపాలని బీసీ జేఏసీ తెలంగాణ జన సమితి నేతలు తమ కార్యాలయానికి వచ్చి అడిగారని తెలిపారు. తమ కంటే ముందే బంద్‌కి కోదండరాం సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తుచేశారు. కోదండరాం మద్దతుతో బంద్ వందశాతం సక్సెస్ అయినట్లేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన నాయకుడు కోదండరాం అని ప్రశంసించారు. తెలంగాణలోని రెండున్నర కోట్ల బీసీల హక్కుల కోసం ఈ బంద్ చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సమాజం ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్స్ కోసం బిల్లు రూపకల్పన చేశారని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీల నోటికాడి ముద్దను కొంతమంది లాక్కుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్స్ వ్యతిరేకులారా.. జనాభా దామాషా ప్రకారం తమ వాటా తమకు కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. అఖిల పక్షాన్ని రాష్ట్రపతి, ప్రధానిని కల్పించాలని కోరారు. రాష్ట్రపతి, ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే.. వారి ఇళ్ల ముందు ధర్నా చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

# తుమ్మల, పొన్నంకు మానవత్వం ఉందా

- మాగంటి సునీతను అవమాన పరుస్తారా
- మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్



**హైదరాబాద్, అక్టోబర్ 14:** మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు మానవత్వం ఉందా? వాళ్లు మనుషులేనా? అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గోపన్న అమర్ రహే అంటుంటే, తన భర్త గోపినాథ్‌ను గుర్తు చేసుకొని మాగంటి సునీత ఏడుస్తుంటే డ్రామా అంటారా తుమ్మల నాగేశ్వరరావు? కమ్మ సామాజిక వర్గం ఓటు వేస్తే గెలిచిన తుమ్మల, అదే వర్గానికి చెందిన నేత గోపినాథ్ సతీమణిని డ్రామా అంటారా? అని ప్రశ్నించారు. మాగంటి సునీతకు మంత్రుల వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించాయని, వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల మాటలను తెలంగాణ ఆడబిడ్డలు గమనించాలి అని ఆయన వ్యాఖ్యానించారు. యువకుడు..అలాగే, ప్రెస్ మీట్ సమయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రుల పక్కనే కూర్చున్నా, ఆడబిడ్డ అవమానింపబడుతుండగా మౌనంగా ఉన్నారని గౌడ్ విమర్శించారు. రాజీవ్ గాంధీ చనిపోయినప్పుడు పార్టీలకతీతంగా అందరం బాధ పడ్డామని, ఇప్పుడు మాగంటి సునీత తన భర్తను గుర్తుచేసుకొని ఏడుస్తుంటే దాన్ని డ్రామా అంటారా? ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. మాగంటి సునీత భావాలను దెబ్బతీసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

## పొన్నం, తుమ్మల క్షమాపణలు చెప్పాలి

### ఎమ్మెల్సీ తాతా మధు డిమాండ్

**హైదరాబాద్, అక్టోబరు 14:** 'మీరు చనిపోతే మీ భార్యలు ఏడవరా..?' అని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు మండిపడ్డారు. వాళ్లు చనిపోతే వాళ్ల భార్యలు ఏడుస్తారో లేదో మంత్రులే చెప్పాలన్నారు. తెలంగాణ మహిళలకు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో మంత్రులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వెన్నులో వణుకుపుడుతోందని అన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ మహిళా లోకాన్ని అవమానించే విధంగా, చిల్లరగా మాట్లాడారని తాతా మధు విమర్శిం చారు. ఇలాంటి నికృష్టమైన మంత్రులు తెలంగాణలో ఉండటం దురదృష్టకర మన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ చనిపోతే అందరూ సానుభూతి చూపారని, కానీ ఇలా నీచంగా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్.. మేయర్ విజయలక్ష్మిని, విజయారెడ్డిని పక్కన పెట్టుకుని మాగంటి సునీతపై కామెంట్స్ చేశారని మధు మండిపడ్డారు. పాలేరు ఉప ఎన్నికల్లో తుమ్మల నాగేశ్వరరావు.. రాంరెడ్డి వెంకట్ రెడ్డి సతీమణి సుచరితపై గెలిచారని గుర్తుచేశారు. ఆడబిడ్డలు, భర్తలు చనిపోయిన వారిని అవమానించే విధంగా మంత్రులు మాట్లాడారని ఆరోపించారు.

# మంత్రుల మధ్య విభేదాలు అబద్ధం



మీడియా చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్

**నల్గొండ,అక్టోబరు14 :** ఇరిగేషన్ శాఖలో అవినీతి ఆరోపణలు అవాస్తవమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తన శాఖ, తన జిల్లా అభివృధి పనులపై తాను ఫోకస్ పెట్టానని వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య సమన్వయం ఉందని.. విబేధాలు లేవని క్లారిటీ ఇచ్చారు. మంగళవారం ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. తన శాఖలో బదిలీలు నిబంధనల ప్రకారం జరిగాయని.... ప్రాసెస్ అంతా తానే దగ్గరుండి చూశానని చెప్పుకొచ్చారు. నీటి వాటాల్లో తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని ఉద్ఘాటించారు. కర్ణాటకలో కాంగ్రెస్, మహారాష్ట్రలో బీజేపీ, ఏపీలో టీడీపీ ఉన్నా తమ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. బనకచర్ల, ఆల్మట్టిపై తాము నిబంధనల ప్రకారం÷ట్ చేస్తున్నామని తెలిపారు. కృష్ణా, గోదావరిలో నీటి వాటాల కోసం తమ ప్రభుత్వం కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందని పేర్కొన్నారు. త్వరలోనే తాము మహారాష్ట్ర వెళున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. కేసీఆర్ పదేళ్లలో చేసింది ఏమిలేదని ఆక్షేపించారు. కాళేశ్వరం పేరుతో మిగతా ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా... భారతదేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పంటలు పండాయని నొక్కిచెప్పారు. ధాన్యం కొనుగోలు కోసం రూ.25 వేల కోట్లు రైతులకు కేటాయిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



# మాగంటి సునీతకు బీఫామ్ అందించిన కేసీఆర్

**హైదరాబాద్,అక్టోబరు 14:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన మాగంటి సునీతా గోపీనాథ్ కు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరఫున రూ.40 లక్షల చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపినాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితరులు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక జరుగుతున్నది. ఈ సందర్భంగా కెసిఆర్ వారిని ఆశీర్వదించారు.

# బీఆర్ఎస్‌లోకి పలువురు చేరిక

### కండువా కప్పి ఆహ్వానించిన కెటిఆర్

**హైదరాబాద్, అక్టోబరు 14:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్‌లోకి చేరికలు ఊపందుకున్నాయి. నియోజకవర్గంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అలీ మస్కతి, టీడీపీ సీనియర్ మహిళా నేత షకీలా రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలనే లక్ష్యంతోనే పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. మస్కతి, షకీలారెడ్డి చేరికతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ చేరికల సందర్భంగా కేటీఆర్‌తో మాజీ మంత్రులు మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, పార్టీ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, రాజీవ్ సాగర్, తుంగబాలు తదితరులు ఉన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు లంచం డిమాండ్

### ఎసిబికి చిక్కిన విద్యుత్ లైన్‌మెన్

**నాగర్‌కర్నూల్, అక్టోబరు 14:** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ అవినీతి అధికారి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. జిల్లాలోని వంగూర్ మండలం మాచినోనిపల్లి గ్రామం టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన లైన్‌మెన్ తోట నాగేంద్ర మంగళవారం రూ.15 వేలు లంచం తీసుకుంటూ చిక్కాడు. వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రైతులు లైన్‌మెన్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత రైతు మహబూబ్‌నగర్ పరిదిలోని ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం అధికారులు పట్టుకున్నారు. అవినీతికి పాల్పడ్డ లైన్‌మెన్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అవినీతికి పాల్పడే వారి సమాచారాన్ని ఏసీబీ టోల్ ఫ్రీ 1064 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. వాట్సప్ నంబర్ 9440446106కు తెలంగాణ ఏసీబీ ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

### మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబర్ 14:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో భారత రాష్ట్ర సమితి గూబ గుయ్యిమనేట్లు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంతవుతుందని జోస్యం చెప్పారు. పదేళ్లలో ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల నమోదుకు భారత రాష్ట్ర సమితి, భాజపాలదే బాధ్యతని అన్నారు. మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ.. గులాబీ పార్టీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని పొన్నం విమర్శించారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గట్టి బుద్ధి చెప్పబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఏ మాత్రం ముందుకు సాగలేదని, ఇప్పుడు ప్రజలే ఆ విఫలతకు తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో ఒక్క రోడ్డు సరిచేయలేని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఓట్ల కోసం నటన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలకూ ప్రజలు సరైన పాఠం చెప్పబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈసారి ఓటర్లు మోసపోవడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..
4 కరీంనగర్ బుధవారం 15 అక్టోబర్ 2025

# సంపాదకీయం




# మమతా బెనర్జీ బాధ్యతారాహిత్యం

సమాజంలో రాక్షస ప్రవృత్తి పెరుగుతోంది. అత్యాచారాలు, హత్యలు, హత్యాకాండలు పెచ్చుమీరడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా వరుస ఘటనలు తీవ్రమైనవిగా పరిగణించాలి. ప్రభుత్వాలు ఈ తరహా నేరాలపై అధ్యయనం చేయాలి. కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలి. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఎపి, తెలంగాణ ఇలా అనేక రాష్ట్రాల్లో సభ్యసమాజం తలదించుకునేలా ఘటనలు జరుగుతున్నాయి. చివరకు చిన్నారి బాలలపైనా మూర్ఖులు లైంగికదాడులకు పాల్పడడం దారుణం. హైదరాబాద్‌లో, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలలపై ఉపాధ్యాయులే లైంగిక దాడికి తెగించడం దుర్మార్గపు చర్య. ఇలాంటి వారిని బహిరంగం గానే ఉరితీయాలి. ఇకపోతే మళ్లీ అక్కడక్కడా పరువు హత్యలు సాగుతున్నాయి. కులాలు, మతాలు కలవక పోవడంతో ప్రేమ పెళ్లిళ్లకు అడ్డుపడుతున్నారు. ఇలా సమాజంలో భయం లేకపోవడం వల్ల, చట్టాల్లో లొసుగుల వల్ల ప్రజల్లో రాక్షసత్వం పెరిగిపోతోంది. అత్యాచారాలు సులవుగా చేసేస్తున్నారు. దొంగతనాలు, హత్యలకు కొదువే లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రహితంగా ఉన్నాయి. అత్యాచార ఘటనపై స్పందిస్తూ..అర్ధరాత్రి ఆ అమ్మాయి ఒంటరిగా ఎందుకు బయటకు వచ్చిందని పెడసరంగా ప్రశ్నించారు. ఒక సిఎంగా ఉన్న మమత మహిళ అయినా ఇలాంటి విషయాల్లో కనీస ఇంగితం లేకుండా మాట్లాడారు. కొన్నేళ్లుగా మహిళలపై నేరాల్లో బెంగాల్, కోల్‌కతా ముందువరసలో ఉంటున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో వార్షిక నివేదికలు ఘోషిస్తున్నాయి. దుర్గాపూర్ అత్యాచార దుర్ఘటనను ఖండిస్తూ మహిళలు, విద్యార్థులు, డాక్టర్స్ సంఘాలు, ఆరోగ్య కార్యకర్తల నుంచి రెండు రోజులుగా ఆందోళనలు పెల్లుబకగా, బాధ్యత కలిగిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత స్పందన బాధితు రాలిని, కుటుంబ సభ్యులను, యావత్ మహిళాలోకాన్ని కించపరిచింది. రాత్రిపూట క్యాంపస్ నుంచి బయటికి ఎందుకు వెళ్లింది, ఆ సమయంలో ఏం పని, అని సిఎం అసహనం చెందారు. ఏ సమయంలోనైనా బయటికి వెళ్లడం ప్రాథమిక హక్కు అయినప్పటికీ స్త్రీలు రాత్రుళ్లు రోడ్లపైకి రాకూడదని విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క మహిళ ఇంటి ముందు పోలీసులను కాపలాగా పెట్టలేమంటూ మహిళా భద్రతపై చేతులెత్తేశారు.పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌లో ఐక్యూ ప్రైవేటు మెడికల్ కాలేజీ విద్యార్థినిపై కాలేజీ క్యాంపస్ పరిసరాల్లో జరిగిన సామూహిక అత్యాచారం బెంగాల్‌లో మహిళా భద్రతా వైఫల్యాన్ని మరొకసారి బట్టబయలు చేసింది. ఒరిస్సాకు చెందిన విద్యార్థిని వైద్య విద్యనభ్యసించేందుకు ఆ కాలేజీలో చేరగా ఈ ఘోరం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి తన స్నేహితునితో కలిసి డిన్నర్‌కు క్యాంపస్ వెలుపలికి వెళ్లగా విద్యార్థినిని మృగాళ్లు అటకాయించి చేతిలోని ఫోన్‌ను లాక్కొని దగ్గరలోని దట్టమైన చెట్లలోకి బలవంతంగా లాక్కెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టారు. విషయం బయటికి చెబితే తీవ్రమైన పర్యవసానాలు ఉంటాయని దుండగులు బాధితురాలిని భయపెట్టారు. ఫోన్‌ను తిరిగి ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. కాగా విద్యార్థినిని డిన్నర్‌కు బయటికి తీసుకెళ్లిన యువకుడు మధ్యలోనే పరారయ్యాడని అంటున్నారు. అందుకే అతనిపైనా అనుమానాలు కలుగుతున్నాయి. అత్యాచారంలో ఈ ఫ్రెండ్ పాత్ర తెలియాలంటే పోలీస్ దర్యాప్తు ముమ్మరంగా జరగాలి. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని దుర్గాపూర్, కోల్‌కతా, బెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. జాతీయ మహిళా కమిషన్ బెంగాల్‌లో మహిళలకు సరైన భద్రత కల్పించాలని మమత ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిరుడు ఆగస్టులో ఆర్‌జి కర్ ఆస్పత్రిలో రాత్రిపూట వైద్య విధుల్లో ఉన్న లేడీ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఉదంతం సంచలనమైంది. ఆందోళనలతో బెంగాల్ రాష్ట్రం అట్టుడికింది. అయినా బెంగాల్లో మమతా బెనర్జీ పాలనతీరు మారలేదు. మహిళలకు రక్షణ కల్పించడం లేదు. అంటే మృగాళ్లకు భయం కలగడం లేదు. దీనికితోడు మమత చేసిన వ్యాఖ్యలు మృగాళ్లకు ఊతమిచ్చేలా ఉన్నాయి. ఏం మాట్లాడాలో కూడా తెలియని బాధ్యతారహిత నాయకులు ఉండడం సిగ్గుచేటు. ఆర్‌జికర్ ఆస్పత్రి వ్యవహారంలో అంతా మాయ జరిగింది. అసలు నిందితులను వదిలేసి ఓ అమాయకుడిని అందులో ఇరికించేశారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగానూ నిరసనలు మిన్నంటాయి. ఈ కేసులో సివిక్ పోలీస్ వలంటీర్ సంజరు రారుకి జీవిత ఖైదు పడింది. అసలు నిందితులను వదిలేశారని నేటికీ బాధితురాలి కుటుంబం పోరాడుతూనే ఉంది. ఆర్‌జి కర్ ఘోరాన్ని మరవకముందే దుర్గాపూర్ దారుణం సంభవించింది. ఈ ఏడాది జులైలో దక్షిణ కలకత్తా లా కాలేజీ విద్యార్థినిపై అత్యాచారం జరిగింది. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో కాలేజీ క్యాంపస్‌లలో విద్యార్థినులపై జరుగుతున్న వరుస అత్యాచారాలు విద్యా సంస్థలు, వాటి పరిసరాల్లో భద్రతా చర్యలపై డొల్ల తనాన్ని ప్రశ్నిస్తున్నాయి. పటిష్టమైన భద్రత, నిఘా, అప్రమత్తపు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. బిజెపిని విమర్శిస్తున్న మమతా బెనర్జీ తన ఏలుబడిలో బెంగాల్లో వరుస ఘటనలు జరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. అత్యాచారం వంటి దారుణాలు జరిగినప్పుడు ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు బాధ్యతగా ఉండాలి. బాధజతులకు న్యాయం జరుగుతుందన్న ఆత్మవిశ్వాసం వారిలో కలిగించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలాలి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కానీకుండా హెచ్చరికలు చేయాలి. మహిళలలో భయం పోగొట్టి భరోసా నింపాలి. ఇటువంటి స్పందనను ఒక మహిళా ముఖ్యమంత్రి నుంచి మహిళలు, ప్రజలు ఆశిస్తారు. కానీ మమత అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం తగనిపని.

# పూరన్ ఆత్మహత్యపై సత్వర దర్యాప్తు

- ఉన్నతస్థాయిలో కూడా దళితులకు స్వేచ్ఛ కరవు
- పూరన్ కుటుంబ సభ్యులకు రాహుల్ పరామర్శ



**చండీఘడ్, అక్టోబర్ 14:** హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పూరన్ కుమార్ కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా పూరన్‌కు నివాళులర్పించిన ఆయన.. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాధికారిపై ఇలాంటి వివక్ష చోటుచేసుకోవడం విషాదకరమన్నారు. ఈ కేసుకు సంబంధించి స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని స్వయంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ హామీ ఇచ్చారన్నారు. కానీ, రోజులు గడుస్తున్నా.. అది నెరవేరటం లేదని విమర్శించారు. తండ్రిని పోగొట్టుకున్న పూరన్‌కుమార్ ఇద్దరు పిల్లలు చాలా ఒత్తిడిలో ఉన్నారన్నారు. పూరన్ కుమార్ కెరీర్‌ను, ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇతర అధికారులు సంవత్సరాలుగా వివక్ష కొనసాగిం చారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది కేవలం ఒక దళిత కుటుంబానికి సంబంధించినది కాదని, దేశంలోని కోట్లాది మంది దళితులకు సంబంధించినదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిపై జరిగిన వివక్ష దళితులుగా ఎంత విజయం సాధించినా.. అణచివేత తప్పదనే తప్పుడు సందేశం వారికి వెళ్లేలా చేస్తుందన్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, సీఎంలను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఉన్న ఒత్తిడిని తొలగించాలన్నారు. ఇక, ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. బ్యూరోక్రసీ, పోలీస్ వ్యవస్థలో కుల వివక్ష ఉందనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆయన ఆత్మహత్యపై తక్షణం స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలని, ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఐపీఎస్ అధికారి కుటుంబానికి సంబంధించినదని కాదని, కోట్లాది దళితుల ఆత్మ గౌరవానికి సంబంధించినదని అన్నారు. పూరన్ కుమార్ అక్టోబర్ 7న రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎనిమిది పేజీల సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియాతో సహా పలువురు పేర్లు ఆయన ప్రస్తావించారు. కుల వివక్ష, మానసిక వేధింపులు, పబ్లిక్‌లో అవమానించడం వంటి చర్యలకు వీరు పాల్పడ్డారని ఆరోపించారు.

## హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్

### తాత్కాలిక బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం

**చండీఘడ్, అక్టోబర్ 14:** హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతాధికారులు కుల వివక్ష, అవమానాలు, వేధింపులు తట్టుకో లేక హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆయన.. తన సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ బిజార్ణియా సహా 8 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు రాశారు. వారి వేధింపులే తన ఈ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల నుంచే కాకుండా.. పూరన్ కుమార్ కుటుంబం నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. దాంతో రోహ్‌తక్ ఎస్పీ బిజార్ణియాపై ప్రభుత్వం ఇప్పటికే బదిలీ వేటు వేసింది. అలాగే డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను సెలవుపై ప్రభుత్వం పంపించింది. దీంతో కొత్త డీజీపీగా తాత్కాలిక నియామకం అనివార్యమైంది. మరో వైపు అక్టోబర్ 7వ తేదీన ఆత్మహత్య చేసుకున్న పూరన్ కుమార్ కుటుంబం.. తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రముఖ రాజకీయ పార్టీల అధినేతలతో వరుస భేటీ అవుతుంది. ఉన్నతాధికారులను కఠినంగా శిక్షించాలని ఆ కుటుంబం కోరుతుంది.

## హర్యానాలో మరో పోలీస్ అధికారి ఆత్మహత్య

### చనిపోయిన పూరన్ కారణమంటూ సూసైడ్ లేఖ



**చండీఘడ్, అక్టోబర్14:** హరియాణాలో ఇటీవల సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి మరవక ముందే.. తాజాగా మరో పోలీసు అధికారి తనను తాను తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. పూరన్‌ను లక్ష్యంగా చేసుకుని ఆ అధికారి తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఏఎస్సై సందీప్‌కుమార్ రోహ్‌తక్ సైబర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పూరన్ కుమార్‌పై ఉన్న ఓ అవినీతి కేసును ఆయన దర్యాప్తు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పూరన్ కుమార్‌పై తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేశారు. నిజాలు వెలుగులోకి రావడం కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తున్నట్లు రాశారు. పూరన్ కుమార్ ఇటీవల చండీగఢ్‌లోని తన నివాసంలో రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుల వివక్ష, వేధింపులు, అవమానాలతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు ఆయన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఇందులో ఎనిమిది మంది అధికారుల పేర్లను చేర్చారు. ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించింది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాను బదిలీ చేసింది. ఈ క్రమంలో తాజాగా ఓ ఎఎస్సై ఆత్మహత్య చేసుకోవడం, అందుకు పూరన్ కారణమంటూ పేర్కొనడం కలకలం రేపుతోంది.

## దుర్గాపూర్ అత్యాచార ఘటన

### ముగ్గురు నిందితులతో పాటు, సహకరించిన వ్యక్తి అరెస్ట్

### నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతో అరెస్ట్



**కోల్‌కతా, అక్టోబర్ 14:** బెం గాల్‌లో తీవ్ర కలకలం రేపిన ఒడిశాకు చెందిన ఓ వైద్య విద్యార్థినిపై సామూహిక అ త్యాచార ఘటన కేసులో అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులతో పాటు వారికి సహకరించిన మరో యువకుడిని పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. వారు పారిపోయేందుకు సహకరించిన మరో యువకుడిని మంగళవారం అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతోనే పరారీలో ఉన్న అతడిని గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఐదో నిందితుడు సఫీక్ దుర్గాపూర్‌లోని అందాల్ వంతెన కింద దాక్కున్నట్లు అతడి సోదరి రోజినా తమకు సమాచారం ఇవ్వడంతో అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. తన సోదరుడు చేసిన తప్పునకు తగిన శిక్ష అనుభవించాలనే ఉద్దేశంతోనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు రోజినా మీడియాకు తెలిపింది. అత్యాచార ఘటనపై బాధితురాలు మాట్లాడుతూ భయానక క్షణాలను గుర్తు చేసుకుంది. శుక్రవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లినప్పుడు పలువురు దుండగులు తమను వెంబడించినట్లు తెలిపింది. వెంటనే తాము అడవి వైపు పరిగెత్తుతున్న సమయంలో తన స్నేహితుడు మరో వైపునకు వెళ్లగా..నిందితులు తనను బలవంతంగా అటవీప్రాంతంలోకి లాక్కెళ్లినట్లు పేర్కొంది. ఫోన్‌ను లాక్కొని తన స్నేహితుడికి కాల్ చేయాలని బెదిరించారని.. అతడు రాకపోవడంతో తనపై దారుణానికి పాల్పడ్డారని వెల్లడించింది. తాను ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తుం డగా..అరిస్తే మరికొంతమందిని పిలుస్తామని నిందితులు బెదిరించారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ ఘటనలో ఐదుగురు నిందితులను కస్టడీలోకి తీసుకొని..విచారిస్తున్నట్లు వెల్లడించారు. నిందితులను ఘటనా స్థలానికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

## తప్పిపోయిన పిల్లల కోసం నోడల్ అధికారులు

### కేంద్రానికి సుప్రీం ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మిస్సింగ్ కేసుల పర్యవేక్షణకు ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నోడల్ అధికారులను నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈమేరకు ఆదేశాలిచ్చింది. తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను ఆన్‌లైన్ సహా అన్ని మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఒక పోర్టల్ రూపొందించి.. దానిలో అన్ని వివరాలు పొందుపరచాలని ఆదేశించింది. పోర్టల్‌లో అదృశ్యమైన పిల్లల గురించి ఫిర్యాదు అందిన వెంటనే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్థులపై కేసులు నమోదు చేసి..తగిన చర్యలు తీసుకోవచ్చని సూచించింది.



## విశాఖలో గూగుల్ సెంటర్

### వికసిత భారత్ లక్ష్యాలకు తార్కాణం

### సుందర్ పిచాయ్‌కు మోడీ అభినందనలు

**న్యూఢిల్లీ, అక్టోబర్14:** విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై మోదీతో ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ చేసిన పోస్ట్‌కు ప్రధాని బదులిచ్చారు. గిగా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పనిచేస్తుంది. దీనిద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుంది. మన డిజిటల్ ఎకానమీకి మరింత ఊపునిస్తుంది. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానం మరింత సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. దీనికి ముందు పిచాయ్ స్పందిస్తూ.. విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచుకునేందుకు ప్రధానితో మాట్లాడానని, ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఇదొక చిరస్మరణీయమైన రోజు. విశాఖలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణం కోసం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం, ఏఐ విప్లవంలో భాగం కావడం గర్వంగా ఉంది. ఈ పెట్టుబడులు హెల్త్‌కేర్, వ్యవసాయం, లాజిస్టిక్స్, ఫైనాన్స్ వంటి రంగాల్లో వేగవంతమైన ఏఐ ఆధారిత పరిష్కారాల కోసం తగిన వ్యవస్థను సృష్టిస్తుంది. సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడంలో తగిన తోడ్పాటు లభిస్తుందని గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. దిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ రానున్న ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. భారత్‌లో ఈ కంపెనీకి ఇదే అతిపెద్ద పెట్టుబడి కావడం విశేషం.

# బాదంపప్పును పొట్టుతో తినాలా?

## పొట్టు తీసేసి తినాలా..? ఎలా తింటే మేలు చేస్తుంది?

ఆరోగ్యంగా ఉండడం కోసం పౌష్టికాహారాలను తినాలన్న విషయం అందరికీ తెలిసిందే. పౌష్టికాహారాలను తింటే శరీరానికి కావల్సిన అన్ని పోషకాలు లభిస్తాయి. దీంతో అనేక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. అయితే పౌష్టికాహారాల విషయానికి వస్తే వాటిల్లో బాదంపప్పు ముందు వరుసలో నిలుస్తుందని చెప్పవచ్చు. దీన్ని రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు చెబుతుంటారు. అయితే బాదంపప్పును పొట్టు తీసి తినాలని కొందరు అంటారు. పొట్టుతోనే తినాలని మరికొందరు సూచిస్తారు. మరి ఇందులో నిజం ఎంత ఉంది..? అసలు బాదంపప్పును పొట్టుతో తినాలా, పొట్టు తీసి తినాలా..? నీటిలో నానబెట్టి తింటే ఏం జరుగుతుంది..? వంటి విషయాలకు గాను నిపుణులు సమాధానాలు చెబుతున్నారు. ఇక ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.



**పొట్టు తీసి తింటే..**

బాదంపప్పు పొట్టులో టానిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం శోషించుకోకుండా అడ్డుకుంటాయి. కనుక బాదంపప్పును పొట్టు తీసి తినాల్సి ఉంటుంది. అలాగే బాదంపప్పు పొట్టులో ఫైటిక్ యాసిడ్ ఉంటుంది. ఇది ఐరన్, జింక్, క్యాల్షియం, మెగ్నీషియం వంటి మినరల్స్‌కు అతుక్కుంటుంది. మనం తిన్న ఆహారంలో ఈ పోషకాలు ఉంటే వాటిని శరీరానికి అందకుండా అడ్డుకుంటుంది. కనుక ఈ కారణం వల్ల కూడా బాదంపప్పును పొట్టు తీసేసి తినాల్సి ఉంటుంది. అలాగే బాదంపప్పు పొట్టులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కొందరికి సరిగ్గా జీర్ణం కాదు. జీర్ణ సమస్యలను సృష్టిస్తుంది. గ్యాస్ వచ్చే అవకాశాలు ఉంటాయి. కనుక బాదంపప్పును పొట్టు తీసి తింటే మంచిది. ఆయుర్వేద కూడా బాదంపప్పును పొట్టు తీసే తినాలని చెబుతోంది. బాదంపప్పును నీటిలో నానబెట్టి పొట్టు తీసి తింటే ఇంకా మంచిదని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

**పొట్టుతో తింటే..**

అయితే బాదంపప్పు పొట్టులోనూ అనేక పోషకాలు ఉంటాయి. ఈ పొట్టులో ఫైబర్‌తోపాటు పాలిఫినాల్స్, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. పొట్టు తీసేసి తింటే ఈ పోషకాలను కోల్పోవాల్సి వస్తుంది. కనుక బాదంపప్పును పొట్టుతో తినవచ్చు. ఇందులో సందేహించాల్సిన పనిలేదు. బాదంపప్పు పొట్టు వల్ల మనకు ఎలాంటి హాని కలగదు. కానీ అజీర్తి ఉన్నవారు, పోషకాహార లోపం సమస్యలు ఉన్నవారు మాత్రం బాదంపప్పును నీటిలో నానబెట్టి పొట్టు తీసి తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దీని వల్ల సులభంగా జీర్ణం అవడంతోపాటు కావల్సిన పోషకాలు లభిస్తాయి. ఇలా బాదంపప్పును ఎవరి సౌకర్యానికి తగినట్లు వారు తినవచ్చు. ఇక బాదంపప్పును తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

**బాదంపప్పుతో కలిగే లాభాలు..**

నానబెట్టి పొట్టు తీసిన బాదంపప్పును తింటే తేలిగ్గా జీర్ణమవుతుంది. మన శరీరానికి కావల్సిన ఆరోగ్యకరమైన కొవ్వులు సులభంగా లభిస్తాయి. బాదంపప్పును తినడం వల్ల విటమిన్ ఇ, రైబోఫ్లేవిన్, ఎల్-కార్నిటైన్ అనే పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచుతాయి. మెదడు యాక్టివ్‌గా మారేలా చేస్తాయి. బాదంపప్పులో ఉండే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం మన శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పప్పును తింటుంటే బరువు తగ్గుతారు. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. బాదంపప్పులో ఉండే విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి. అలాగే శిరోజాలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. ఇలా బాదంపప్పుతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# అసలు మనకు నిద్ర ఎందుకు అవసరం..?

**రోజూ తగినన్ని గంటలపాటు నిద్రించకపోతే ఏమవుతుంది..?**



నిద్ర అనేది మనిషి శరీరానికి అత్యవసరం. సరైన మోతాదులో నీళ్లను తాగడం, వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ఎంత అవసరమో రోజూ తగినన్ని గంటల పాటు నిద్రించడం కూడా అంతే అవసరం. నిద్రించడం వల్ల మెదడు పునరుత్తేజం చెందుతుంది. మెదడు కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. రోజంతా మనం చేసే పనులను జ్ఞాపకాల రూపంలో మెదడు భద్రపరుచుకునేందుకు నిద్ర ఉపయోగపడుతుంది. మన జ్ఞానం, తెలివితేటలు, నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు మెదడుకు నిద్ర అవసరం అవుతుంది. నిద్ర వల్ల శరీరం కూడా తన భాగాలకు తాను మరమ్మత్తులు చేసుకుంటుంది. ముఖ్యంగా కణజాలాలు మరమ్మత్తులకు గురవుతాయి. కండరాలు, కణాలు నిర్మాణమవుతాయి. నిద్ర వల్ల శరీరం వ్యర్థాలను సులభంగా బయటకు పంపిస్తుంది. హార్మోన్లు సక్రమంగా పనిచేస్తాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఇలా నిద్ర వల్ల మనకు ఎంతో మేలు జరుగుతుంది.

**అనేక సమస్యలు..**

అయితే రోజూ తగినన్ని గంటలపాటు కచ్చితంగా నిద్రించాల్సి ఉంటుంది. నిద్ర అనేది వ్యక్తిని, వయస్సును, వాతావరణ పరిస్థితులను బట్టి ఒక వ్యక్తి రోజుకు ఎన్ని గంటలపాటు నిద్రించాలి అనే సమయం మారుతుంది. సాధారణంగా రోజుకు 6 నుంచి 8 గంటల పాటు అయినా సరే నిద్రించాలని వైద్యులు చెబుతుంటారు. అయితే సరిగ్గా నిద్రించకపోతే అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయి. మెదడు పనితీరు మందగిస్తుంది. చురుగ్గా ఉండలేకపోతారు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గుతాయి. మతిమరుపు పెరుగుతుంది. ఏ విషయంపై ధ్యాస పెట్టలేకపోతుంటారు. ఆసక్తిగా అనిపించదు. ఎల్లప్పుడూ ఆందోళన, కంగారు, విసుగు ఉంటాయి. నిర్ణయాలను తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తుంటారు. బద్ధకంగా ఉంటారు. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. అతిగా ఆహారం తింటారు. దీంతో బరువు పెరుగుతారు.

**దీర్ఘకాలంలో అయితే..**

దీర్ఘకాలంలో నిద్రలేమి సమస్య ఉంటే అది తీవ్ర అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. నిద్రలేమి వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పొంచి ఉంటుంది. జీవక్రియలు మందగిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. మానసిక ఆరోగ్యం సన్నగిల్లుతుంది. శరీరం వ్యర్థాలను బయటకు పంపలేకపోతుంది. దీంతో శరీరం విషతుల్యంగా మారి రోగాలు వస్తాయి. కనుక ఇలా జరగకుండా ఉండాలంటే రోజూ తగినన్ని గంటలపాటు నిద్రించాల్సి ఉంటుంది. అయితే నిద్రలేమి సమస్య ఉన్నవారు రోజూ వ్యాయామం చేయడం, ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకోవడం వంటి పనులు చేస్తే ఫలితం ఉంటుంది. అలాగే కొన్ని రకాల ఆహారాలను రాత్రి పూట తీసుకోవడం వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. ఆ ఆహారాలను తీసుకుంటే నిద్రను ప్రోత్సహిస్తాయి. దీంతోపాటు పలు పోషకాలను కూడా అందిస్తాయి.

**ఈ ఆహారాలను తీసుకోవాలి..**

రాత్రి పూట నిద్ర సరిగ్గా పట్టాలంటే ట్రిప్టోఫాన్, మెలటోనిన్, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు ఉండే ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. ట్రిప్టోఫాన్ లభించాలంటే రాత్రి పూట పాలను తాగాలి. చికెన్, కోడిగుడ్లు, చీజ్, పల్లీలు, గుమ్మడికాయ విత్తనాలు, టోఫు వంటి ఆహారాలను తీసుకుంటే మెలటోనిన్ లభిస్తుంది. వాల్ నట్స్, పిస్తా కూడా మేలు చేస్తాయి. చెర్రీ పండ్లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. అలాగే బాదంపప్పు, పాలకూర, అవకాడో, అరటి పండ్లను తింటుంటే మెగ్నీషియం లభిస్తుంది. ఇది కూడా నిద్రను ప్రోత్సహిస్తుంది. చిలగడదుంపలు, ఓట్ మీల్, బ్రౌన్ రైస్, కమోమిల్ టీ వంటి వాటిని తీసుకుంటున్నా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. అయితే వీటిని రాత్రి నిద్రకు ఒక గంట ముందు తీసుకుంటే ఫలితం ఉంటుంది. ఇలా నిద్రలేమిని తగ్గించుకోవచ్చు. రోజూ తగినన్ని గంటలపాటు కచ్చితంగా నిద్రించవచ్చు.

# మొలకలను ఇంట్లోనే ఇలా సులభంగా తయారు చేయండి..

## వీటిని తినే విషయంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!



మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు అనేక బలవర్ధకమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మొలకలు కూడా ఒకటి. పెసలు, పల్లీలు, శనగలు తదితర గింజలను నీటిలో నానబెట్టి వాటితో మొలకలను తయారు చేస్తారు. మొలకలు చాలా బలవర్ధకమైన ఆహారంగా చెప్పవచ్చు. కానీ చాలా మంది వీటిని తినేందుకు అంతగా ఆసక్తిని చూపించరు. మొలకలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మొలకలను చాలా మంది సాధారణంగా బయట కొంటుంటారు. కానీ కాస్త శ్రమిస్తే వీటిని ఇంట్లోనే మనం ఎంతో సులభంగా తయారు చేసుకోవచ్చు. మొలకలను తయారు చేసేందుకు పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. అన్ని రకాల గింజలను కొంత మోతాదులో తీసుకుని అన్నింటినీ కలిపి చాలా సులభంగా మొలకలను తయారు చేయవచ్చు.

**మొలకల తయారీ ఇలా..**

ఆయా గింజలను తీసుకుని శుభ్రంగా కడిగి వాటిని ముందుగా 8 నుంచి 10 గంటల పాటు నీటిలో నానబెట్టాల్సి ఉంటుంది. తరువాత వాటిని నీటి నుంచి తీసి శుభ్రమైన వస్త్రంలో ఉంచి చుట్టాలి. అనంతరం వాటిని ఒక పాత్రలో ఉంచి మీద మూత పెట్టాలి. 24 నుంచి 48 గంటల పాటు వేచి చూస్తే ఆ గింజలకు మొలకలు వస్తాయి. తరువాత వాటిని తీసి మళ్లీ కాస్త కడిగి అనంతరం వాటిని తినవచ్చు. ఇలా ఇంట్లోనే సులభంగా మొలకలను తయారు చేసుకోవచ్చు. అయితే మనం ఎంచుకునే గింజలను బట్టి అవి మొలకలుగా మారేందుకు సమయం పడుతుంది. పల్లీలు, పెసలు, శనగలు దాదాపుగా ఒకే సమయంలో మొలకలుగా మారుతాయి. కనుక వీటిని అన్నింటినీ ఒకేసారి నానబెట్టి ఒకేసారి మొలకలుగా మార్చేందుకు వస్త్రంలో చుట్టి ఉంచవచ్చు. కానీ ఇతర గింజలకు మాత్రం ఇంకాస్త ఎక్కువ సమయం పడుతుంది. కనుక అలాంటి గింజలను విడిగా నానబెట్టి మొలకలుగా మార్చాల్సి ఉంటుంది.

**మొలకలను తినే విషయంలో..**

మొలకలను నేరుగా తినేందుకు కొందరు ఇష్టపడరు. అలాంటి వారు మొలకలను పెనంపై కాస్త వేయించి ఉప్పు, కారం లేదా మిరియాల పొడి వంటివి చల్లి తినవచ్చు. లేదా సలాడ్ రూపంలో మొలకలను తయారు చేసి తినవచ్చు. అయితే మొలకలను ఎట్టి పరిస్థితిలోనూ శుభ్రంగా కడిగిన తరువాతే తినాల్సి ఉంటుంది. సాధారణంగా మొలకలు బ్యాక్టీరియాను కలిగి ఉంటాయి. కనుక అలాగే తింటే బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ బారిన పడే అవకాశాలు ఉంటాయి. కనుక మొలకలను బాగా కడిగాకే తినాల్సి ఉంటుంది. మొలకలపై మిరియాల పొడి, నిమ్మరసం, నల్ల ఉప్పు వంటివి చల్లి తింటే ఎంతో రుచిగా ఉండడమే కాదు, ఇంకా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. మొలకల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక ఇవి జీర్ణం అయ్యేందుకు సమయం పడుతుంది. అందువల్ల వీటిని కేవలం ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలోనే తినాల్సి ఉంటుంది. రాత్రి పూట తినకూడదు. సాయంత్రం వ్యాయామం చేసేవారు వ్యాయామం చేశాక వీటిని తినవచ్చు.

**లాభాలు ఇవే..**

మొలకలను తినడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. భిన్న రకాల గింజలతో మొలకలను తయారు చేసి తింటే ఒకేసారి పెద్ద ఎత్తున పోషకాలను పొందవచ్చు. మొలకలను తింటే ప్రోటీన్లు పెద్ద ఎత్తున లభిస్తాయి. అలాగే ఫోలేట్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, మాంగనీస్, విటమిన్లు సి, కె అధికంగా లభిస్తాయి. మొలకల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు ఉన్నవారు రోజూ మొలకలను తింటుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. మొలకల్లో ఉండే ఫైబర్ జీర్ణ సమస్యలను తగ్గించడంతోపాటు అధిక బరువు తగ్గేలా చేస్తుంది. ఇలా మొలకలను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# విటమిన్ ఎ లోపం ఉంటే కనిపించే లక్షణాలు ఇవే..

## అసలు రోజుకు ఇది మనకు ఎంత అవసరం..? ఏమేం ఆహారాలను తినాలి..?

మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అనేక పోషకాలు మనకు అవసరం అవుతాయి. వాటిల్లో విటమిన్ ఎ కూడా ఒకటి. ఇది మన శరీరంలో అనేక జీవక్రియలను నిర్వహిస్తుంది. అలాగే కంటి చూపును మెరుగు పరిచి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ పనితీరుకు కూడా ఉపయోగపడుతుంది. అయితే సాధారణంగా విటమిన్ ఎ లోపం వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. గతంలో విటమిన్ ఎ లోపం అధికంగా వచ్చేది. కానీ అవగాహన పెరగడంతో ప్రజలు పౌష్టికాహారం తీసుకుంటున్నారు. విటమిన్ ఎ లోపం రాకుండా జాగ్రత్త వహిస్తున్నారు. కానీ కొందరిలో ఈ లోపం పలు అనుకోని కారణాల వల్ల ఏర్పడుతోంది. విటమిన్ ఎ లోపం ముఖ్యంగా గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నారుల్లో అధికంగా వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి. సిస్టిక్ ఫైబ్రోసిస్, క్రానిక్ డయేరియా వంటి వ్యాధులు ఉన్నవారికి కూడా విటమిన్ ఎ లోపం సంభవిస్తుంది.



**విటమిన్ ఎ లోపం ఉంటే కనిపించే లక్షణాలు..**

విటమిన్ ఎ లోపం ఉంటే మన శరీరం మనకు పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. విటమిన్ ఎ లోపం వల్ల చర్మ కణాలు కొత్తగా ఏర్పడడం తగ్గుతుంది. దీంతో చర్మ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చర్మం ఎల్లప్పుడూ పొడిగా మారి నిర్జీవంగా కనిపిస్తుంది. అలాగే ఎగ్జిమా, దురద, గజ్జి, తామర వంటి చర్మ సమస్యలు కూడా తరచూ వస్తుంటాయి. విటమిన్ ఎ లోపం ఉన్నవారిలో కంటి సమస్యలు తరచూ వస్తుంటాయి. ముఖ్యంగా కళ్లలో నీరు తగ్గిపోతుంది. దీంతో కళ్లు పొడిగా మారి దురదలు పెడతాయి. దీర్ఘకాలంలో ఇది అంధత్వానికి దారి తీసే ప్రమాదం కూడా ఉంటుంది. విటమిన్ ఎ లోపం మరీ అధికంగా ఉంటే రేచీకటి సమస్య వస్తుంది. రాత్రి పూట చూపు మందగిస్తుంది. విటమిన్ ఎ లోపించిందని చెప్పేందుకు దీన్ని ప్రధాన కారణంగా భావించవచ్చు. అలాగే విటమిన్ ఎ లోపం ఉన్న స్త్రీ, పురుషుల్లో సంతానం కలగరు. ప్రత్యుత్పత్తి అవయవాల పనితీరు సరిగ్గా ఉండదు. కనుక సంతాన లోపం సమస్య ఉంటుంది. పిల్లల్లో ఎదుగుదల లోపం ఉండడం, తరచూ గొంతు లేదా ఛాతి ఇన్‌ఫెక్షన్లు వస్తుండడం, గాయాలు ఆలస్యంగా మానడం, మొటిమలు తరచూ అధికంగా వస్తుండడం వంటివి కూడా విటమిన్ ఎ లోపం ఉందని తెలియజేసే లక్షణాలుగా అర్థం చేసుకోవాలి.

**ఎవరికి ఎంత అవసరం..?**

విటమిన్ ఎ వయస్సును బట్టి రోజుకు నిర్దిష్టమైన మోతాదులో అవసరం అవుతుంది. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 6 నెలల వయస్సు ఉన్నవారికి రోజుకు 400 మైక్రోగ్రాముల విటమిన్ ఎ అవసరం. 7 నుంచి 12 నెలలు ఉన్నవారికి 500 మైక్రోగ్రాములు, 1 నుంచి 3 ఏళ్ల వారికి 300 మైక్రోగ్రాములు, 4 నుంచి 8 ఏళ్ల వారికి 400 మైక్రోగ్రాములు, 9 నుంచి 13 ఏళ్ల వారికి 600 మైక్రోగ్రాములు, 14 నుంచి 18 ఏళ్ల వారికి (బాలురు అయితే) 900 మైక్రోగ్రాములు, 14 నుంచి 18 ఏళ్ల వారికి (బాలికలు అయితే) 700 మైక్రోగ్రాములు, పురుషులకు 900 మైక్రోగ్రాములు, స్త్రీలకు 700 మైక్రోగ్రాములు, గర్భిణీలకు 770 మైక్రోగ్రాములు, పాలిచ్చే తల్లులకు రోజుకు 1300 మైక్రోగ్రాముల విటమిన్ ఎ అవసరం అవుతుంది. విటమిన్ ఎ మనకు పలు ఆహారాల్లో లభిస్తుంది.

**విటమిన్ ఎ ఉండే ఆహారాలు..**

పాలకూర, బ్రొకొలి, గ్రేప్ ఫ్రూట్, మిరపకాయలు, చీజ్, యాప్రికాట్స్, పిస్తాపప్పు, యాపిల్స్, క్యారెట్లు, కోడిగుడ్లు, అవకాడో, బొప్పాయి, చిలగడదుంపలు, చేపలు తదితర ఆహారాల్లో విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తుంది. విటమిన్ ఎ ఉండే ఆహారాలను రోజూ తీసుకుంటే ఈ లోపం నుంచి బయట పడవచ్చు. అలాగే విటమిన్ ఎ లోపం ఉన్నవారు డాక్టర్లు ఇచ్చే మందులను కూడా క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. విటమిన్ ఎ ట్యాబ్లెట్లను కేవలం డాక్టర్లు సూచించిన కాల పరిమితి వరకు మాత్రమే వాడాలి. వీటిని అధికంగా వాడితే దుష్పరిణామాలు ఎదురవుతాయి. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ ఆయా ఆహారాలను తీసుకుంటుంటే విటమిన్ ఎ లోపం నుంచి సులభంగా బయట పడవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు. రోగాలు రాకుండా ఉంటాయి.



# ఏసీబీకి చిక్కిన సిరిసిల్ల సర్వేయర్

**నేటి సాక్షి, సిరిసిల్ల:** సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్న బోనాలకు చెందిన ఓ రైతు వద్ద లంచం తీసుకుంటుండగా సర్వేయర్ వేణును ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధిత రైతుకు చెందిన చిన్న బోనాల ప్రాంతంలోని 3 ఎకరాల భూమి సర్వే కోసం సర్వేయర్ వేణు రూ.20వేలు లంచం డిమాండ్ చేశాడు. మొదటగా రూ.10వేలు తీసుకున్న వేణు, సర్వే పూర్తయిన తర్వాత మిగిలిన రూ.20వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. సర్వేయర్ వేణును అదుపులోకి తీసుకున్న అధికారులు కేసు నమోదు చేశారు.

### ఆరు నెలల్లో ఇద్దరు సర్వేయర్లు..

ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ నాగరాజు సైతం ఓ రైతు వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆరు నెలల క్రితం పట్టుకొని జైలుకు తరలించారు. ఆరు నెలల వ్యవదిలో ఇద్దరు సర్వేయర్‌లు ఏసీబీకి పట్టుబడటం జిల్లాలో సంచలనం సృష్టిస్తుంది.

# ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలకు ఆహ్వానం

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే

**నేటి సాక్షి, సిరిసిల్ల:** అమర పోలీసుల జ్ఞాపకార్థం ఈ నెల 21న పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోలీస్ రిలేటెడ్ అంశంపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం తీసేందుకు జిల్లాలో ఆసక్తి గల యువతకు, ఔత్సహిక ఫొటోగ్రఫర్లు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీ సాయంత్రంలోగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ పీఆర్వోకి అందజేయాలని సూచించారు. ఈ షార్ట్ ఫిలిం 3 నిమిషాలు మించొద్దని, 10 %ఇ% 8 సైజ్ ఫొటోలను పెన్ డ్రైవ్ లో పూర్తి వివరాలతో అందజేయలన్నారు. జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన మూడు షార్ట్ ఫిలింలు, ఫొటోలను రాష్ట్రస్థాయి పోటీల గురించి డీజీపీ ఆఫీస్ హైదరాబాద్‌కు పంపించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం 87126 56431 నెంబర్ ద్వారా పీఆర్వోను సంప్రదించాలని సూచించారు.

# 17న రాజన్న కోడెల పంపిణీ

**నేటి సాక్షి, సిరిసిల్ల:** ఈ నెల 17న వేములవాడ తిప్పాపూర్‌లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని 200 కోడెల జతలను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం అర్హత కలిగిన రైతులు జిల్లా వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ https://rajannasircilla.telangana.gov.inలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కోడెలు పంపిణీ చేసే రోజున రైతులు ఆన్లైన్లో నమోదు చేసిన ఆయా సర్టిఫికెట్లు పత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు. గురువారం ఉదయం వరకూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుని కోడెలు తీసుకెళ్లని వారు పత్రాలతో రావాలని కలెక్టర్ సూచించారు. జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు.

# ఆలయంపై రాజకీయం చేయొద్దు

### విప్ దిష్టిబొమ్మ దహనంపై కాంగ్రెస్ నేతల ఫైర్

**నేటి సాక్షి, వేములవాడ:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయాన్ని రాజకీయ వేదికగా మార్చొద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో సోమవారం బీజేపీ నాయకులు ఆలయం ముందు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను తగలబెట్టడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ముందు కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయడం తప్పు అంటూ ప్రశ్నించారు. అయితే అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు దర్శనానికి అనుమతి ఇవ్వకపోవడాన్ని వారు సమర్థించకపోయినా, ఆలయ అభివృద్ధి మాత్రం నిలిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆలయ అభివృద్ధిపై రాజకీయ పార్టీల మధ్య వాగ్వాదం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు

### బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ

**నేటి సాక్షి, వేములవాడ:** మేం అభివృద్ధికి వ్యతిరేకం కాదని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన స్థానిక నేతలతో కలిసి వేములవాడ రాజన్న ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధిలో భాగంగా రాజన్న గుడిలో జరిగే ఆర్జిత సేవలు, ఆకు పూజలు, కోడె మొక్కులు, ఇతర పూజ కార్యక్రమాలు భక్తుల సౌకర్యార్థం భీమన్న గుడిలోకి మార్చామనే ప్రకటన వెలువడినప్పటి నుంచి బీజేపీ భక్తుల మనోభావాలు, నమ్మకాన్ని కాపాడే విధంగా నిరసన ,ఆందోళన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మా ఆందోళనను అర్థం చేసుకున్న ప్రభుత్వం కేంద్ర హెూం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ సలహాలు, సూచనలతో వేములవాడ రాజన్న గుడిలో ఆర్జిత సేవలతో పాటు, ఆకు పూజలు, అన్నపూజ, కోడె మొక్కులు ఆలయ ప్రాంగణంలోని కొనసాగిస్తామని ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయం ద్వారా ఓ సర్కులర్ జారీ చేయడంపై గోపీ హర్షం వ్యక్తం చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలోనే భక్తులకు దర్శనం కల్పించాలనే తమ ఆలోచన ప్రభుత్వానికి అర్థమైనా.. స్థానికంగా ఉన్న కొందరి నాయకులకు అర్థం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# సీఎంను కలిసిన విప్ ఆది శ్రీనివాస్

**ప్రజానావ, వేములవాడ:** సీఎం రేవంత్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, విస్తరణ పనుల తీరు తెన్నుల గురించి, కలికోట సూరమ్మ చేరవు రిజర్వాయర్‌పై చర్చించారు. అనంతరం శృంగేరి జగద్గురువుల శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి వారి విజయ యాత్ర సందర్భంగా హైదరాబాద్ లోని నల్లకుంట శంకర్ మఠనికి జగద్గురువుల దర్శనానికి వస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రిని రావాల్సిందిగా శంకర మఠం ధర్మాదికారి శ్రీనివాస మూర్తి,రాముబంటు,రవి,శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధ కృష్ణ శర్మ గారితో కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

# కూతురిపై అత్యాచారం.. తండ్రికి ఏడేళ్ల జైలు

**నేటి సాక్షి,కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** కూతురిపై అత్యాచారం చేసిన తండ్రికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధించింది. బాన్సువాడ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్ సూర్యదేవర విజయభారతి ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. పరిశోధనలో స్పష్టమైన సాక్ష్యాలను సేకరించి పోక్సో చట్టం కింద నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ మంగళవారం తీర్పునిస్తూ నిందితుడికి శిక్ష విధించారు. జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర మాట్లాడుతూ నేరం చేసిన వారెవ్వరూ చట్టం నుంచి తప్పించుకోలేరని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు, ప్రాసిక్యూషన్ సమర్థంగా వ్యవహరించారన్నారు. ఈ కేసులో కృషి చేసిన మాజీ డీఎస్పీ సత్యనారాయణ, అదనపు ప్రాసిక్యూటర్ శేషు, డీఎస్పీ విఠల్‌రెడ్డి, ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, కానిస్టేబుల్



సాయి తదితరులను ఎస్పీ అభినందించారు. 2025 జనవరి 11 నుంచి 17 వరకు పాఠశాలకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. విద్యార్థులు తమ స్వగ్రామాలకు వెళ్లి 18న హాస్టల్‌కు చేరుకున్నారు. అయితే ఒక విద్యార్థి మూడు రోజులు ఆలస్యంగా పాఠశాలకు రావడం జరిగింది. అదేరోజు విద్యార్థిని మెడికల్ చెకప్ కోసం హాస్పిటల్‌కు పంపించారు. క్లాస్ టీచర్ ఆ విద్యార్థిని ఒక గదిలో పిలిచి అడిగినప్పుడు ఆమె సంక్రాంతి సెలవుల్లో తమ స్వగ్రామానికి వెళ్ళినపుడు ఇంట్లో ఎవరులేని సమయంలో తన తండ్రి బలవంతంగా లైంగికంగా అనుచితంగా ప్రవర్తించాడని తెలిపింది. వెంటనే బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పరిశోధనలో భాగంగా కుటుంబ సభ్యులను, గ్రామస్తులను విచారించి బాధితురాలి తండ్రిని నేరస్తుడిగా గుర్తించి పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, పోలీస్ తరపున వాదనలు వినిపించిన అదనపు ప్రాసిక్యూటర్ శేషు, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత విఠల్ రెడ్డి, బాన్సువాడ పట్టణ పోలీసులు, కోర్ట్ లైజన్ ఆఫీసర్, ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, కోర్ట్ కానిస్టేబుల్ జి సాయిలను ఎస్పీ అభినందించారు.

# పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

### కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**నేటి సాక్షి,కామారెడ్డి:** భూభారతి పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లోగా మపరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మహమ్మద్ నగర్, బిచ్కుంద, గాంధారి, లింగంపేట మం డలాల తహశీల్దార్లతో సమావేశం నిర్వహించి భూభారతి పెండింగ్ దరఖాస్తుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా ఎదుర్కొంటున్న ప్రజల భూసమస్యను వేగంగా, పారదర్శకంగా పరి ష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువ



చ్చిందన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. వెంటనే ప్రత్యేక డ్రైవర్ నిర్వహించి మండలాల్లో ఉన్న భూభారతి దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లోగా పరిష్కరించాలని సూచించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారం త్వరగా జరిగేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, సంబంధిత ఆర్డీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎల్లారెడ్డి ఆర్డీఓ పార్థసింహారెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ ఏవో, కలెక్టరేట్ సూపరెంటెండెంట్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో టెస్టులో భారత్ ఘన విజయం

## 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్ పై విక్టరీ... గిల్ కెప్టెన్సీలో 2-0తో తొలి సిరీస్ సొంతం




శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా తొలి టెస్ట్ సిరీస్ నెగ్గింది. ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత, పర్యాటక జట్టు విండీస్‌ను ఫాలో-ఆన్ ఆడించింది. తొలి టెస్టులో ఎదురైన సీన్ దాదాపు రిపీట్ అయింది. అయితే, వెస్టిండీస్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్ లో తమ పోరాటాన్ని చూపారు. ఈసారి చాలా ధైర్యంగా, నిలకడగా భారత బౌలర్లను ఎదుర్కొన్న తీరు అమోఘం. అయితే భారత్ ఛేదించడానికి 121 పరుగుల సాధారణ లక్ష్యాన్ని ఇచ్చింది విండీస్ జట్టు. 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలినా, భారత్ సునాయాసంగా విజయం సాధించింది.కేఎల్ రాహుల్ ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. కీలక సమయాల్లో నిలకడగా బ్యాటింగ్ చేశాడు. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ (100 పరుగులు) సాధించాడు. ఇప్పుడు రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన స్కోర్‌ను ఛేజింగ్ చేసే క్రమంలో హాఫ్ సెంచరీ చేశాడు. 58 పరుగులతో మ్యాచ్ ముగించాడు. నిన్న మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ త్వరగా అవుట్ అయిన తర్వాత పరిస్థితులను చక్కదిద్దాడు. తాజా ఇన్నింగ్స్ తో టెస్ట్ ఫార్మాట్‌లో రాహుల్ ఖాతాలో 20 అర్ధ సెంచరీలు, 11 సెంచరీలు ఉన్నాయి. సాయి సుదర్శన్ 76 బంతుల్లో 39 పరుగులు చేసి ఔటయ్యాడు. రెండో టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లోనూ 87 పరుగులతో రాణించాడు. ఫీల్డింగ్ లోనూ మెరిశాడు. మొదటి టెస్ట్‌లో 50 పరుగులు, ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో 129 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ 4వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి కేవలం 13 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్ విజయానికి కావాల్సిన పరుగులు చేశారు.విండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో టీమిండియా ఎపెనర్ యశస్వి జైస్వాల్ 219 పరుగులతో సిరీస్‌ను టాప్ స్కోరర్‌గా ముగించాడు. రెండో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో అతను చేసిన 175 పరుగులు సిరీస్ లో అత్యుత్తమ స్కోరు. జైస్వాల్ తర్వాత కేఎల్ రాహుల్ (196 పరుగులు), శుభ్‌మన్ గిల్ (192) ఉన్నారు. వికెట్లలోనూ భారత బౌలర్లు ఆధిపత్యం చెలాయించారు. లెఫ్టార్మ్ స్పిన్నర్, చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ 12 వికెట్లతో అగ్ర స్థానంలో నిలవగా, ఆ తర్వాత స్థానాల్లో ఉన్న మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా వరుసగా 10, 8 వికెట్లు తీశారు.

**భారత్ తొలి ఇన్నింగ్స్ 518/5 వద్ద డిక్లేర్**

జైస్వాల్ (175), శుభ్‌మన్ గిల్ (129 నాటౌట్), ధ్రువ్ జురెల్ (44), నితీశ్ రెడ్డి (43) రాణించారు.
కుల్‌దీప్ యాదవ్ (5/82), జడేజా (3/46)
భారత్ రెండో ఇన్నింగ్స్ 124/3
వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ : 248 ఆలౌట్
రెండో ఇన్నింగ్స్: 390 ఆలౌట్
కాంప్‌బెల్ (115), షై హోప్ (103), జస్టి

# విజయం సాధించాలనే ఫాలో ఆన్ ఆడించాం

## టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్



విజయం సాధించాలనే లక్ష్యంతోనే వెస్టిండీస్‌ను ఫాలో ఆన్ ఆడించామని టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ఆఖరి రోజు విజయానికి కావాల్సిన 6 , 7 వికెట్లు తీయడం కష్టమవుతుందని భావించే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశాడు. న్యూఢిల్లీ వేదికగా మంగళవారం ముగిసిన రెండో టెస్ట్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే తొలి సిరీస్ విజయం.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 518/5 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్‌కు 270 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. దాంతో విండీస్‌ను ఫాలో ఆన్ ఆడించి ఇన్నింగ్స్ తేడాతో గెలవాలని భారత్ భావించింది. కానీ ఈ వ్యూహం బెడిసి కొట్టింది.బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై వెస్టిండీస్ పోరాడింది. రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగుల భారీ స్కోర్ చేసింది. దాంతో ఆఖరి రోజు టీమిండియా బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. విండీస్ మరో 100-120 పరుగులు చేసి ఉంటే ఈ మ్యాచ్‌లో టీమిండియాకు విజయం కష్టమయ్యేది. ఈ క్రమంలోనే ఫాలో ఆన్ ఆడించడంపై విమర్శలు వచ్చాయి.మ్యాచ్ అనంతరం ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాన్ని శుభ్‌మన్ గిల్ వివరించాడు. 'భారత జట్టుకు సారథ్యం వహించడం గొప్ప గౌరవం. కెప్టెన్సీకి నేను అలవాటు పడుతున్నాను. పరిస్థితులకు తగ్గట్లు నిర్ణయాలు తీసుకుంటున్నాను. కండిషన్స్‌కు తగ్గట్లు ఏ ఆటగాడు పరుగులు చేస్తాడు..? ఏ బౌలర్ వికెట్ తీస్తాడనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. మాకు సుమారు 300 పరుగుల ఆధిక్యం లభించింది. మేం మళ్లీ బ్యాటింగ్ చేసి 500 పరుగులు చేసినా.. ఆఖరి రోజు 5, 6 వికెట్లు తీయాల్సి వస్తే కష్టమవుతుందని భావించాం. విజయం సాధించాలనే లక్ష్యంతోనే ఫాలో ఆన్ ఆడించాం. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ లభించాలనే నితీష్ రెడ్డిని అప్‌దీ ఆర్డర్ ఆడించాం.ఈ మ్యాచ్‌లో అతను బౌలింగ్ చేయలేదు. విదేశాల్లోనే నేరుగా బ్యాటింగ్ చేయాల్సి వస్తే ఆటగాళ్లు ఒత్తిడికి గురవుతారు. అందుకే స్వదేశంలోనే కొందరి ఆటగాళ్లకు అవకాశం ఇచ్చి వారిని విదేశీ పర్యటనకు సిద్ధం చేయాలనుకున్నాం. నేను బ్యాటింగ్ వెళ్లినప్పుడు బ్యాటర్‌గానే నిర్ణయాలు తీసుకుంటాను. నేను 3-4 ఏళ్ల వయసు నుంచి బ్యాటింగ్ చేస్తున్నాను. కాబట్టి బ్యాటర్‌గా ఆలోచిస్తాను. ఏం చేసినా జట్టు విజయం కోసమే చేస్తాను. ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించి ఇంకా ఎలాంటి ప్రణాళికలు రచించలేదు. అది సుదీర్ఘ విమాన ప్రయాణం. ఫ్లైట్‌లో కూడా ప్లాన్ చేసుకోవచ్చు.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.

# విండీస్‌తో రెండో టెస్టులో సిరాజ్ అరుదైన ఫీట్



హైదరాబాదీ ఏస్ పేసర్ మహ్మద్ సిరాజ్ టెస్టుల్లో అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. ఈ ఏడాది అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. సోమవారం నాలుగో రోజు వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హోప్ వికెట్ ను తీసిన అనంతరం ఈ ఏడాది లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. ఓవరాల్ గా ఈ ఏడాది 8 మ్యాచ్ లు ఆడిన సిరాజ్.. 1575 బంతులు వేశాడు. రఫ్ గా చెప్పాలంటే 262.3 ఓవర్లను నిలకడగా బౌలింగ్ చేశాడు. మె- ఎత్తంమీద 37 వికెట్లను తీశాడు. అతని సగటు 26.91 కావడం విశేషం. ఓవరాల్ గా తను ఈ ఏడాది టెస్టుల్లో 39 మెయిడిన్లు వేశాడు. అలాగే 996 పరుగులను సమర్పించుకున్నాడు. తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన 6-70 కావడం విశేషం. ఇక 42.56 స్ట్రైక్ రేట్ తో 3.79 ఎకానమీ రేటుతో తను బౌలింగ్ చేశాడు. ఓవరాల్ గా తన ఖాతాలో రెండు నాలుగు వికెట్ల ప్రదర్శన, రెండు ఐదు వికెట్ల ప్రదర్శన ఉన్నాయి. వెస్టిండీస్ తో రెండో టెస్టు కుముందు 36 వికెట్లతో జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ నెంబర్ వన్ స్థానంలో ఉన్నాడు. తను ఈ ఏడాది 9 మ్యాచ్ లు ఆడి, 276.4 ఓవర్లు వేశాడు. సగటు 28.63 కాగా, 47 మెయిడిన్లను వేశాడు. ఇక వెస్టిండీస్ తో జరుగుతున్న రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ ను కొనసాగించిన వెస్టిండీస్ సోమవారం నాలుగో రోజు 118.5 ఓవర్లలో 390 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత్ ముందు 121 పరుగుల టార్గెట్ ను నిర్దేశించింది. ఇక ఈ మ్యాచ్ లో నాలుగో రోజు బ్యాటింగ్ చేసి, ఓపెనర్ జాన్ క్యాంబెల్ (199 బంతుల్లో 115, 12 ఫోర్లు, 3 సిక్సర్లు), షాయ్ హోప్ (214 బంతుల్లో 103, 12 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో సత్తా చాటారు. మూడో వికెట్ కు వీరిద్దరూ కలిసి 177 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో టీమిండియా ముందు 100ం రన్స్ టార్గెట్ ఉంచగలిగింది. బౌలర్లలో కుల్దీప్ యాదవ్, జస్ ప్రీత్ బుమ్రాకు మూడేసి వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత్.. ఆటముగిసేసరికి 18 ఓవర్లలో వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో యశస్వి జైస్వాల్ (8) త్వరగా ఔటవగా, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (25 బ్యాటింగ్), వన్ డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంకా విజయానికి భారత్ కు 58 పరుగులు కావాలి. తొలి టెస్టును ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన భారత్.. రెండు టెస్టుల సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉంది. మ్యాచ్ కు మంగళవారం ఆఖరిరోజు. దాదాపు లంచ్ విరామం లోపలే ఈ మ్యాచ్ ఫలితం తేలే అవకాశం ఉంది. ఇక తొలి ఇన్నింగ్స్ ను భారత్ 5 వికెట్లకు 518 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జైస్వాల్ (175) టాప్ స్కోరర్ గా నిలిచాడు. మరోవైపు తమ తొలి ఇన్నింగ్స్ లో విండీస్ 248 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 270 పరుగుల లీడ్ ఇండియాకు దక్కింది.

# కోహ్లి, రోహిత్‌కు ఆస్ట్రేలియా పర్యటన కీలకం

## మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయం

టీమిండియా మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవితవ్యం ఆస్ట్రేలియా పర్యటనతో తేలనుందని మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చడంతో పాటు ఫామ్, ఫిట్‌నెస్ కొనసాగిస్తే వన్డే ప్రపంచకప్ 2027 వరకు కొనసాగుతారని తెలిపాడు. టీ20, టెస్ట్ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, రోహిత్ కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే తమ లక్ష్యమని ఈ ఇద్దరూ ఆటగాళ్లు తెలిపారు. అందుకు సన్నదం కూడా అవుతున్నారు. ఐపీఎల్ 2025 సీజన్ అనంతరం పూర్తిగా ఇంటికే పరిమితమైన ఈ ఇద్దరూ సీనియర్ ఆటగాళ్లు.. ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది.తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న రవిశాస్త్రి.. రోహిత్, కోహ్లీ భవితవ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉన్నందుకే రోహిత్, కోహ్లీ



ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికయ్యారు. అయితే ఫామ్, ఫిట్‌నెస్‌పైనే వారి ప్రపంచకప్ భవితవ్యం ఆధారపడి ఉంది. ఫామ్ కొనసాగిస్తూ ఫిట్‌గా ఉంటేనే రెండేళ్ల తర్వాత జరిగే ప్రపంచకప్‌లో చోటు దక్కుతుంది. వారి భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే దిశగా ఆస్ట్రేలియాతో సిరీస్ వారిద్దరికీ కీలకం. ఈ సిరీస్‌తో వారికి వారే తమ కెరీర్‌పై ఓ నిర్ణయానికి రావొచ్చు. కుర్రాళ్ల నుంచి పోటీ పెరుగుతుందని ఈ ఇద్దరికీ తెలుసు. జట్టు ప్రణాళికల్లో ఉండాలంటే ఏం చేయాలో వారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.'అని రవిశాస్త్రి చెప్పుకొచ్చాడు.

**ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన భారత వన్డే జట్టు:**

శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్(కీపర్), ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ.

**వన్డే షెడ్యూల్..**

తొలి వన్డే: అక్టోబర్ 19(ఆదివారం),పెర్త్, ఉదయం 9 గంటలకు
రెండో వన్డే: అక్టోబర్ 23(గురువారం), అడిలైడ్, ఉదయం 9 గంటలకు
మూడో వన్డే: అక్టోబర్ 25(శనివారం), సిడ్నీ , ఉదయం 9 గంటలకు

# వ్యూస్ కోసమే హర్షిత్ రాణాపై విమర్శలు

## క్రిష్ శ్రీకాంత్‌పై గౌతమ్ గంభీర్ ఆగ్రహం

టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్‌పై గౌతమ్ గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. యూట్యూబ్ వ్యూస్ కోసం యువ క్రికెటర్ అయిన హర్షిత్ రాణాపై విమర్శలు గుప్పిస్తారా? అని మండిపడ్డాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేసిన వన్డే, టీ20 జట్లలో హర్షిత్ రాణాకు చోటు దక్కడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే.గౌతమ్ గంభీర్‌కు ప్రియ శిష్యుడు కావడంతోనే హర్షిత్ రాణాకు మూడు ఫార్మాట్లలో అవకాశాలు దక్కుతున్నాయని క్రిష్ శ్రీకాంత్‌తో పాటు పలువురు నెటిజన్లు ఆరోపించారు. మూడు ఫార్మాట్లలో ఆడే ప్రతిభ హర్షిత్ రాణాకు లేదని అభిప్రాయపడ్డారు. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ అనంతరం గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా హర్షిత్ రాణాపై వచ్చిన విమర్శలను గంభీర్ ముందు ప్రస్తావించగా ఘాటు వ్యాఖ్యలు చేశాడు.'యూట్యూబ్ వ్యూస్ కోసం 23 ఏళ్ల ఆటగాడిని విమర్శించేందుకు సిగ్గుండాలి. ఇలా మాట్లాడటం అన్యాయం. హర్షిత్



రాణా తండ్రి మాజీ చీఫ్ సెలెక్టర్ కాదు. మాజీ క్రికెటర్ కూడా కాదు. చివరకు ఎన్ఆర్ఐ కూడా కాదు. అతను ఎవరి మద్దతు లేకుండా తన సొంత ప్రతిభతో క్రికెట్ ఆడుతున్నాడు. అవకాశం వచ్చినప్పుడల్లా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. ఆటగాళ్లను వ్యక్తిగతంగా లక్ష్యం చేస్తూ మాట్లాడటం సరికాదు. వారి ప్రదర్శన గురించి మాట్లాడండి. ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించేందుకు సెలెక్టర్లు ఉన్నారు. సోషల్ మీడియా వేదికగా ఓ 23 ఏళ్ల యువకుడిపై ఘాటైన విమర్శలు చేస్తే.. అతని మానసిక స్థితి ఏం కావాలి?భవిష్యత్తులో మీ పిల్లలు క్రికెట్ ఆడి.. వారు వ్యక్తిగత దూషణకు గురైతే ఈ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. అతను 23 ఏళ్ల కుర్రాడు. అతనిది 33 ఏళ్ల వయసు కాదు. హెడ్ కోచ్‌గా నన్ను విమర్శించండి. నేను భరించగలను. కానీ 23 ఏళ్ల కుర్రాడిపై అనవసర విమర్శలు చేయడం భావ్యం కాదు. భారత క్రికెట్ పట్ల నైతిక బాధ్యత ఉండాలి. మీ యూట్యూబ్ ఛానెల్ వ్యూస్ కోసం ఇలాంటి విమర్శలు చేయకూడదు. ఇది హర్షిత్ రాణా విషయంలోనే కాదు.. భవిష్యత్తులో ఏ ఆటగాడిపై కూడా ఇలా వ్యక్తిగత విమర్శలు చేయకూడదు.'అని క్రిష్ శ్రీకాంత్‌ను ఉద్దేశించి గంభీర్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.

# చిరుతో జత కట్టేందుకు వస్తున్న వెంకీ




టాలీవుడ్‌లో తనదైన శైలిలో కామెడీ, ఎమోషన్ మేళవించి ప్రేక్షకులను మెప్పించిన సూపర్‌హిట్ దర్శకుడు అనిల్ రావిపూడి. మెగాస్టార్ చిరంజీవితో కలిసి 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్ తో ఒక కమర్షియల్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో సినిమా వస్తుందన్న వార్తతోనే ఫ్యాన్స్ ఉత్సాహంలో మునిగిపోయారు. వెంకటేష్‌తో 100 కోట్ల క్లబ్‌లో చేరిన అనిల్.. ఈసారి చిరుతో మరింత భారీ సక్సెస్ అందుకోవడం ఖాయమని మెగా అభిమానులు నమ్ముతున్నారు. ఇకపోతే ఫిలిం సర్కిల్స్‌లో ఈ సినిమా గురించి మరో సెన్సేషనల్ అప్డేట్ హల్‌చల్ చేస్తోంది. అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్లు ఇచ్చిన విక్టరీ వెంకటేష్, ఇప్పుడు చిరు సినిమాలోనూ కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ వార్త చాలా రోజులుగా చర్చనీయాంశమవుతున్నా.. వెంకటేష్ షూటింగ్‌లో పాల్గొనకపోవడంతో కొంత అనుమానం నెలకొంది. అయితే ఇప్పుడు ఆ సందేహాలన్నిటికీ చెక్ పెడుతూ వెంకటేష్ అక్టోబర్ 21 నుంచి మెగాస్టార్‌తో కలిసి షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. అనిల్ రావిపూడి మార్క్ ఫన్‌తో పాటు ఎమోషన్ కలబోసిన పాత్రలో వెంకటేష్ కనిపించబోతున్నారని మేకర్స్ చెబుతున్నారు. దీంతో చిరు, వెంకీ కాంబినేషన్ మళ్లీ తెరపై చూడబోతున్న అభిమానులు సూపర్ ఎక్సైటెడ్‌గా ఉన్నారు. మొత్తానికి, మన శంకర వరప్రసాద్ గారు చిత్రం టాలీవుడ్‌లో సంక్రాంతి బరిలో భారీ సంచలనాన్ని సృష్టించబోతుందనే నమ్మకం పెరుగుతోంది.





## సినిమాల్లో విఎఫ్ఎక్స్ కీలక భూమిక

ఈ మధ్య అనేక సినిమాలు ఆలస్యం కావడం..దానికి విఎఫ్ఎక్స్ కోసం ఆలస్యం అయ్యిందని దర్శకులు చెప్పడం చూస్తున్నాం. సినిమాల్లో ఇప్పుడు విఎఫ్ఎక్స్ కీలకంగా మారింది. సినిమాలలెవల్ పెంచేది అవే. టాలీవుడ్ సినిమాల లెవెల్ తారాస్థాయికి చేరడంలో వీటి పాత్ర ఎందో ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. సినిమా మేకింగ్ లో కొత్త టెక్నాలజీస్ ముఖ్య పాత్ర వహిస్తున్నాయి. ముఖ్యంగా పాన్ ఇండియా మూవీలలో 'గ్రాఫిక్స్' ప్రేక్షకుల కోసం భారీ విజువల్ ఎక్స్పీరియన్స్ ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ మధ్య సినిమాలను గమనిస్తే.. భారీ చిత్రాలు చెప్పిన టైంలో ప్రేక్షకులు ముందుకు రావడం కష్టం అవుతుంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్ తో రూపొందుతున్న పాన్-ఇండియా సినిమాల రీసెంట్ రిలీజ్‌లు గ్రాఫిక్స్ ఆలస్యాల కారణంగా వాయిదా పడడం సాధారణంగా మారింది.ప్రస్తుతం సినిమాలలో విజువల్ ఎఫెక్ట్స్ కీ రోల్ ప్లే చేస్తూ.. ఇండియన్ సినిమాను గ్లోబల్ రేంజ్‌కి తీసుకెళ్తున్నాయి. ముఖ్యంగా పీరియాడిక్, హిస్టారికల్ సినిమాల్లో గ్రాఫిక్స్ మరింత కీలకంగా మారుతోంది. మేకర్స్ ఈ క్రాఫ్ట్‌పై ఎక్కువ టైం కేటాయిస్తూ భారీగా ఖర్చులు పెట్టుతున్నారు. అయితే కొంతమంది మేకర్స్ ఈ పరిస్థితిని తక్కువ బడ్జెట్‌లో బెస్ట్ క్వాలిటీ అవుట్‌పుట్ ఇవ్వడం ద్వారా ప్రేక్షకులను ఆశ్చర్య పరుస్తున్నారు. 'మిరాయి' వంటి సక్సెస్ స్టోరీస్ టాలీవుడ్‌కు కొత్త దిశను చూపించాయని అనవచ్చు. ఇదివరకు 'హనుమాన్' సినిమా కూడా అంతే. ఈ నేపథ్యంలో పాత గ్రాఫిక్స్ టీమ్స్ స్థానంలో కొత్త టీమ్స్ ఎంపిక చేయడం జరుగుతోంది. ఇలా రాబోయే సినిమాల్లో గ్రాఫిక్స్ విషయంలో కొత్త ట్రెండ్ ఏర్పడుతోంది. చివరికి ఈ ఫార్ములా అన్ని సినిమాలకు వర్క్ అవుతుందా అనే సందేహం మాత్రం కొనసాగుతూనే ఉంది.



## అన్ని ఉద్యోగాలు వేరు..నటన వేరు

### టూమచ్ వ్యాఖ్యలపై కాజోల్ క్లారిటీ

ఇటీవల సెలబ్రిటీ టాక్ షో 'టూ మచ్'లో బాలీవుడ్ నటి కాజోల్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. నటీనటులు ఒత్తిడికి గురవుతారని తెలుపుతూ కార్పొరేట్ ఉద్యోగస్థులతో పోల్చారు. ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. తాజాగా ఆమె తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు. ప్రతి వృత్తిని తాను గౌరవిస్తానని తెలిపారు. అన్ని ఉద్యోగాలు వేరు, నటన వేరు. షూటింగ్ సమయంలో నటీనటులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. మేం 'ది ట్రయిల్' రెండో సీజన్ కోసం ఒక ప్రాంతానికి వెళ్లాం. 40 రోజులు విరామం లేకుండా చిత్రీకరించాం. ఆ రోజుల్లో మేం ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. సరిగ్గా తినాలి. ఎప్పుడూ ఒకే లుక్‌లో ఉండాలి. అలా ఉండడం చాలా ఒత్తిడిగా ఉంటుంది. ఇది మిగతా ఉద్యోగులకు ఉండదు. ఆ ఉద్దేశంతోనే నేను పోలిక చెప్పాను. ఆఫీసులలో ఉన్నట్లు నటీనటులకు బ్రేక్ టైం ఉండదు. 9 నుంచి 5 వరకూ ఉద్యోగం చేసేవారు మధ్యలో టీ బ్రేక్ తీసుకోవచ్చు. లేదంటే కొంత సమయం విశ్రాంతి తీసుకోవచ్చు. యాక్టర్స్ అలా చేయలేరు. షూటింగ్ లో విరామ సమయంలో కూడా అందరి కళ్లు నటీనటుల పైనే ఉంటాయి. నవ్వినా, కదులుతున్నా, కూర్చున్నా.. ఏం చేసినా ప్రతిక్షణం పరిశీలిస్తూనే ఉంటారు' అని కాజోల్ తెలిపారు.




## ధమకు పోటీగా వస్తోన్న 'ఏక్ దీవానేకి దీవానియాత్'

మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో ఫిఫ్త్ ఇన్ స్టాల్ మెంట్ మూవీగా వస్తున్న థమ అక్టోబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆయుష్మాన్ ఖురానా, రష్మిక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు ముంజ్య ఫేం ఆదిత్య సర్పోత్థర్ దర్శకుడు. సికిందర్ ఫ్లాప్ తర్వాత నేషనల్ క్రష్ నుండి వస్తోన్న బాలీవుడ్ ఫిల్మ్ ఇదే. ఈ సినిమా కోసం భారీగా ఖర్చుపెట్టింది మడాక్ ఫిల్మ్స్. బాలీవుడ్ ప్రేక్షకులు ఈ ఏడాది హిస్టారికల్ డ్రామా తర్వాత కాస్తో కూస్తో ఆడియన్స్ కనెక్ట్ అయ్యారంటే అవి రొమాంటిక్ లవ్ స్టోరీలకే. సైయారాకు బ్లాక్ బస్టర్ హిట్టిచ్చిన బీ టౌన్ ఆడియన్స్. గతంలో ఫ్లాపైన రొమాంటిక్ స్టోరీ 'సనమ్ తేరీ కసమ్'ను ఈ ఏడాది రీ రిలీజ్ చేస్తే సూపర్ హిట్ చేశారు. ఈ సినిమా ఇచ్చిన స్ఫూర్తితో హర్షవర్ధన్ రాణెళి మరో సారి రొమాంటిక్ డ్రామా 'ఏక్ దీవానేకి దీవానియాత్' తో థమకు పోటీగా అక్టోబర్ 21నే దిగబోతున్నాడు. థమతో హిట్ కొట్టాలని గట్టింగా కోరుకుంతుంది రష్మిక. అందుకోసం అందాలు కూడా ఆరబోసింది. మరి నార్త్ ఆడియన్స్ ఈ దీవాళికి ఎవరి ఖాతాలో హిట్టాస్తారే చూడాలి.

## 23న ఓటిటిలోకి ఓజి మూవీ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన భారీ చిత్రం 'ఓజి సాహో ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటించగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలాన్ గా నటించాడు. డివివి దానయ్య నిర్మించిన ఈ సినిమా భారీ అంచనాల మధ్య సెప్టెంబరు 25న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. ఈ సినిమా భారీ వసూళ్లు రాబడుతూ ఇంకా థియేటర్స్ లో రన్ అవుతోంది. ఇప్పటి వరకు వరల్డ్ వైడ్ గా రూ. 310 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇంతటి సంచనాలు సృష్టించిన ఓజి ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను రిలిజ్ కు ముందే భారీ ధరకు కొనుగోలు చేసింది ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్. ఇప్పుడు తమ ఓటిటీలో స్ట్రీమింగ్ చేసేందుకు డేట్ ఫిక్స్ చేసింది. ఈ నెల 23నుండి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కు రానుంది ఓజి. 28 రోజుల థియేటర్ రన్ తర్వాత ఓటీటీ స్ట్రీమింగ్ కు వస్తోంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడతో పాటు హిందిలోను డిజిటల్ రిలీజ్ కాబోతుంది. థియేటర్స్ లో సంచలనం సృష్టించిన ఈ సినిమా క్షిలో ఎలాంటి వ్యూస్ రాబడుతుందో చూడాలి.

Printed, Published and Owned by SHAIK FAREED, and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: SHAIK FAREED. RNI NO : TGTEL/25/A1737 Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 966605221

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
15 అక్టోబర్ 2025


# అన్ని కాలనీల సమస్యలను పరిష్కారిస్తాం

- మాజీ కార్పొరేటర్ల పెత్తనంపై కిచ్చెన్న ఆగ్రహం
- సప్తగిరి కాలనీకి త్వరలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ
- కేఎల్ఆర్




**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 14 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గము బాలాపూర్ మండల కేంద్ర ంలో బడంగ్ పేట కార్పొరేషన్ లో మాజీ కార్పొరేటర్లు ఇంకా పెత్తనం చెలాయించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇవాళ తుక్కుగూడ కార్యాలయంలో శ్రీ సప్తగిరి కాలనీ వాసులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్, గుడికి దారి గురించి చర్చించారు. సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సహా ఇతర అధికారులను కేఎల్ఆర్ కోరారు.ఏ సమస్యలు ఉన్నా... అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కాలనీవాసులకు కేఎల్ఆర్ సూచించారు. మాజీ కార్పొరేటర్ల పెత్తనం, వసూళ్లు చేస్తే పోలీసులు, అధికారులకు కంప్లైట్ చేయాలని లక్ష్మారెడ్డి చెప్పారు.త్వరలోనే సప్తగిరి కాలనీని సందర్శించి సమస్యలు తెలుసుకుంటానని కిచ్చెన్న హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీ సప్తగిరి కాలనీ వాసులు సహా బడంగ్ పేట కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై ఎం ఎల్ ఏ సమీక్షా సమావేశం



**నేటి సాక్షి (పూరెళ్ల బాపు) జగిత్యాల టౌన్ :** (అక్టోబర్ 14):జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగిత్యాల పట్టణం లో అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ గారు. జగిత్యాల పట్టణం వివిధ వార్డులలో TUFIDC , జనరల్ ఫండ్ తో చేపట్టిన రోడ్లు డ్రైనేజీ పనులు వర్షాల వల్ల పనులు నిలిచిపోయాయి అట్టి పనులు రేపటి నుండి యదావిధిగా ప్రారంభించాలి. ప్రజలకు అత్యవసరం ఉన్న చోట పనులు త్వరిత గతిన ప్రారంభించాలి. పలు సమస్యలు,వివిధ కారణాలతో నిలిచిపోయిన కొన్ని పనులు వేరే వార్డులకు,వార్డులో ఇతర ప్రాంతాలకు మార్చాలని అన్నారు. నాణ్యతతో పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని,పూర్తి అయిన పనులకు త్వరిత గతిన బిల్లులు చెల్లించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, DE లు ఆనంద్ వరుణ్ AE లు శరన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లు

- ప్రధాని పర్యటన సందర్భంగా శ్రీశైలం నందు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ డిజిపి .. హరీష్ కుమార్ గుప్తా



**నేటి సాక్షి 14:నంద్యాల జిల్లా శ్రీశైలం :** అక్టోబర్ 16 న భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రముఖ పుణ్యక్షేత్రం జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం నందు పర్యటించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిజిపి .హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ , భద్రత ఏర్పాట్లు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డిజిపి , ప్రధాని పర్యటించే ప్రదేశాలలో హెలిపాడ్,రోడ్డు మార్గం, భ్రమరాంబ గెస్ట్ హౌస్, శివాజీ స్ఫూర్తి కేంద్రం ,గుడి పరిసర ప్రదేశాలు, సేఫ్ హౌస్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిజిపి గారితో పాటు కర్నూలు రేంజి డిఐజి .కోయ ప్రవీణ్ ఐపీఎస్ ,ఈగల్ టీం ఐజీ .ఆకే. రవికృష్ణ ఐపీఎస్ , నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ ఐపీఎస్ , అదిరాజ్ సింగ్ రాణా ఐపీఎస్. ఏఎస్పి. ఎం.జావళి ఐపీఎస్, ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ ,పాల్గొన్నారు.

# చర్మ లక్షణాల ద్వారా డెంగ్యూ గుర్తింపు సులభం



## ఏఐఎంఎస్ఆర్ క్లినికల్ మీటింగ్‌లో చర్చ

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) చిత్తూరు, అక్టోబర్ 14:** చిత్తూరులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్) మంగళవారం ఆసక్తికరమైన క్లినికల్ మీటింగ్ నిర్వహించింది. పిల్లల వైద్య విభాగం, మానసిక వైద్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వైద్య విద్యార్థులు, పీజీ విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. పిల్లల వైద్య విభాగం పీజీ విద్యార్థి డా. ఆర్. కృష్ణ కిశోర్ రెడ్డి "డెంగ్యూ జ్వరాన్ని గుర్తించే చర్మ సంకేతాలు" అనే అంశంపై ప్రసంగించారు. డెంగ్యూ జ్వరంలో చర్మంపై కనిపించే ప్రత్యేక దద్దుర్లు, వాటి ఆధారంగా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించే మార్గాలను ఆయన వివరించారు. ఈ సమావేశానికి పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్ డా. వి. రాజేష్ కుమార్ మోడరేటర్‌గా వ్యవహరించారు. వైద్య విద్యార్థుల్లో వ్యాధుల నిర్ధారణ సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఇలాంటి చర్చలు ఎంతో దోహదం చేస్తాయని ఫ్యాకల్టీ సభ్యులు అభిప్రాయపడ్డారు. మానసిక వైద్య విభాగం పీజీ విద్యార్థిని డా. జి. సాయి మనసా స్కిజోఫ్రెనియా రోగుల చికిత్సలో తలెత్తే టార్డివ్ డిస్కైనీషియా అనే కదలికల నియంత్రణ లోపం సమస్యను తగ్గించే సమర్థ వైద్యం ౧ మానసిక శాంతి, శారీరక నియంత్రణ అనే అంశంపై కేస్‌స్టడీ ప్రదర్శన చేశారు. స్కిజోఫ్రెనియా చికిత్సలో ఉపయోగించే ఔషధాల వల్ల వచ్చే దుష్ప్రభావాలను, వాటిని ముందస్తుగా గుర్తించి సమర్థంగా నియంత్రించడం ద్వారా రోగి జీవిత నాణ్యతను మెరుగుపరిచే మార్గాలను వివరించారు. ఈ సెషన్‌కు మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. టి. జయప్రియా, డాక్టర్ దినేష్ మోడరేటర్లుగా వ్యవహరించారు. ఫ్యాకల్టీ సభ్యులు,విద్యార్థులు ఈ చర్చను ఆసక్తితో పరిశీలించి, క్లినికల్ అవగాహనను పెంపొందించుకున్నారు. ఈ సమావేశానికి పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సి.మురళి, మానసిక వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.దినేష్ చైర్‌పర్సన్స్‌గా వ్యవహరించారు.కార్యక్రమంలో ఏఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె అగస్టిన్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, కో–ఆర్డినేటర్ డా. వి.రాజేష్ కుమార్, ఫ్యాకల్టీ సభ్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇలాంటి క్లినికల్ చర్చలు విద్యార్థుల్లో విశ్లేషణాత్మక దృక్పథం, నిర్ధారణా నైపుణ్యాలను పెంపొందిస్తాయని, విభాగాల మధ్య జ్ఞాన మార్పిడి, వైద్యసేవల నాణ్యతను మరింతగా పెంచుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఘనంగా ముత్యం ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు



**నేటి సాక్షి.( భూమయ్య మెదక్ జిల్లా.కొల్చారం :** కొల్చారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన ముత్యం ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొల్చారం మండలం చెందిన వివిధ పార్టీల నాయకులకు అధికారులకు పాత్రికేయ మిత్రులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రత్యేక శు భాకాంక్షలు తెలుపుతున్నానని ముత్యం ప్రవీణ్ కుమార్ తెలిపారు. అనంతరం ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. జరగబోయే స్థానిక ఎన్నికల్లో కొల్చారం మండలం బీఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవాలని ఆయన సూచించారు. ముత్యం ప్రవీణ్ కుమార్ కు, వారి కుటుంబ సభ్యులకు కొల్చారం మండలం చెందిన సీనియర్ నాయకులు కొల్చారం మండలం గౌడ సంఘం అధ్యక్షుడు గజిని వెంకట్ గౌడ్, ఉపాధ్యక్షుడు శేఖర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి, పోత శెట్టిపల్లి తాజా మాజీ సర్పంచ్ నాగరాణి నర్సింలు, కొల్చారం మండలం చెందిన సీనియర్ నాయకులు పాల్గొని ముత్యం ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులకు,ప్రవీణ్ కుమార్ కు ప్రత్యేక జన్మదిన వేడుకలు తెలిపారు.

# ప్రమాదకరంగా మారిన రహదారి

**ఓ అధికారి నేను రహదారిని నన్ను కాపాడండి.**

**నాకోసం ప్రజలు టాక్స్‌లు కడుతున్నారు.**



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 14:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల పరిధిలోని కోళ్లపడకల్ నుండి శంషాబాద్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో గాంధీనగర్ తండా వద్ద గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారి గుంతలతో నిండిపోయింది.దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా రాత్రి సమయంలో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల పలువురు బైక్ సవారీలకు ప్రమాదాలు సంభవించాయి.ఈ విషయంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాకోసం ప్రజలు టాక్స్‌లు కడుతున్నారు, ఓ అధికారి నేను రహదారిని, నన్ను కాపాడండి సార్! రోజు ప్రయాణించే ప్రయాణికులు అన్ని విధాల అధికారులను వేడుకుంటున్నారు.స్పందించని మహేశ్వరం,అధికారులు మరియు ప్రభుత్వం,తక్షణమే చర్యలు తీసుకుని రహదారి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు

# మహేశ్వరం మండలంలో పేదవారికి హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలి

**మహేశ్వరం నియోజకవర్గం కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ**



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 14:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల పరిధిలో పేద ప్రజల ఆరోగ్య రక్షణ కోసం విప్రో సంస్థ సహకారంతో హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు మహేశ్వరం నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విప్రో కంపెనీ ప్రోగ్రాం మేనేజర్ అర్చన ని ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో పేద ప్రజలకు వైద్య సదుపాయాలు అందించేందుకు విప్రో వంటి సంస్థలు ముందుకు రావడం సమాజానికి ఆదర్శమని అన్నారు.దీనికి ప్రోగ్రాం మేనేజర్ అర్చన సానుకూలంగా స్పందిస్తూ,త్వరలోనే మండలంలోని ఎంపికైన గ్రామాల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించే ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# మరోసారి ప్రతిభ చాటిన పాములపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

- క్రీడా రంగంలో మరోసారి ప్రతిభ చాటిన పాములపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు:ప్రిన్సిపాల్, నాగ రవీంద్ర, ఫిజికల్ డైరెక్టర్..సాయి కృష్ణ.



**నేటి సాక్షి అక్టోబర్ 14పాములపాడు :** పాములపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభతో మరోసారి గర్వించదగిన విజయాన్ని సాధించారు. ఇటీవల కర్నూల్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 ఎస్.జి.ఎఫ్ సెలెక్షన్లలో పలు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. సాఫ్ట్‌బాల్‌లో, యం. జీవన్ కుమార్, క్రికెట్‌లో ఏ. జయంత్ ఆచారి, బాల్ బ్యాడ్మింటన్‌లోలికె. ప్రణయ్, యం. సందీప్, పి. ప్రసన్న లక్ష్మి, త్రోబాల్.లో యం. ఈశ్వర్, ఏ. అశోక్, క్యారమ్స్‌లో కె. సంతోష్, షటిల్‌లో కె. ప్రణయ్, యం. సందీప్, యస్. ఈశ్వర్ తమ కృషి, నిబద్ధతతో ఆదర్శంగా నిలిచారు.ఈ గర్వకారణమైన విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ నాగ రవీంద్ర , ఫిజికల్ డైరెక్టర్ కె. సాయి కృష్ణ , మరియు రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. విద్యార్థుల కృషి వెనుక ఉన్న ఆచార్యుల మార్గదర్శకత మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ విజయాలు ఆదర్శ పాఠశాల గర్వకారణమై, భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి విజయాలకు పునాది వేస్తాయని ఆయన అన్నారు."క్రీడ అంటే కేవలం గేమ్ కాదు ు అది మన కృషి, క్రమశిక్షణ, సంకల్పానికి ప్రతీక" అనిపాములపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థుల రాష్ట్రస్థాయి విజయం సాధించడం తో చాలా సంతోషకరమైన విషయం అని ప్రిన్సిపాల్ నాగ రవీంద్ర చెప్పడం జరిగింది అని పేర్కొన్నారు.

## దారికి అడ్డంగా చెట్లు-వాహనదారుల ఇబ్బందులు



**నేటి సాక్షి, ధర్మారం:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రం నుండి జగిత్యాల వైపు వెళ్లే రహదారిపై చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి ఇలా దారికి అడ్డంగా ప్రమాదకంగా మారాయి. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ దారి గుండా ప్రయాణం చేసేటప్పుడు మూలమలుపు ఉండి చెట్లు, చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నందున ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే దారిపైన గతంలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలూ ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు దారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలని ప్రమాదాలను నియంత్రించే చర్యలు తీసుకోవాలి అని వాహనదారులు కోరుతున్నారు.

## మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్న శిలారెడ్డి భౌతికకాయానికి నివాళులు

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి.రాజశేఖర్ రెడ్డి.



**నేటి సాక్షి పాములపాడు అక్టోబర్ 14 :-** పాములపాడు మండలంలోని, వాడాల గ్రామంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్న శిలా రెడ్డి అనారోగ్యంతో మరణించడంతో ఆయన పార్థివ దేహానికి నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ప్రభుత్వ టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్-కురువ.రమేష్, టిడిపి మండల సీనియర్ నాయకుడు కురువ.ఎల్లయ్య, తదితర నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించడం జరిగింది. అనంతరం వారు కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వాడాల గ్రామానికి చెందిన చిన్న శిలా రెడ్డి తెలుగుదేశం పార్టీలో మొదటి నుండి ఇప్పటిదాకా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని అన్నారు.ఈ కార్యక్రమంలో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## సురేంద్ర నాయుడు మృతికి మండల ప్రముఖులు నివాళులు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** రామచంద్రాపురం మండలం కొత్త కండ్రిగ పంచాయతీకి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ మాజీ కన్వీనర్ సురేంద్ర నాయుడు సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రామచంద్రాపురం మండలం ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి గారు ,దామోదర్ రెడ్డి, రమేష్ రెడ్డి , చిట్టిబాబు నాయుడు , మిట్ట కండ్రిగ లోకనాథరెడ్డి, ఢిల్లీ రెడ్డి, బాదురు చంగల్రాయిరెడ్డి, కుప్పిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఆది రెడ్డి మరియు సెంథిల్ కుమార్ వంటి ప్రముఖులు కొత్త కండ్రిగ గ్రామానికి వెళ్లి సురేంద్ర నాయుడు భౌతిక కాయానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుమారుడు వంశీని ఓదార్చుతూ తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.

# బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి చేరికలు





- ఎమ్మెల్యే, మండల అధ్యక్షుడు నిర్లక్ష్యం వల్ల కాంగ్రెస్ లో చేరుతున్న కొల్చారం మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు...

**మెదక్ జిల్లా. కొల్చారం.నేటి సాక్షి (భూమయ్య) :** మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నిర్లక్ష్యం వల్ల గత వారం రోజుల క్రితం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొల్చారం మండలంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అభివృద్ధి చేయలేదని ఆరోపణలతోనే కాంగ్రెస్ పార్టీలో చేరామని కొల్చారం మండలం వివిధ గ్రామాలకు చెందిన టిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు తెలిపారు. అలాగే మండల అభివృద్ధికి కొల్చారం మండలం బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా ఎటువంటి సహకారం చేయకపోవడం వల్లనే కొల్చారం మండలంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ యువత నాయకులకు కూడా నిరాశ చెందుతున్నారని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొల్చారం మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా ఆయన సొంత పనుల గురించి పార్టీలో చేదోడు వాదోడుగా పనిచేస్తున్నారు తప్ప ప్రజల గురించి పనులు చేస్తున్న పాపాన పోలేదని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొల్చారం మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా మార్పు రాకపోతే కొల్చారం మండలంలో బిఆర్ఎస్ పార్టీకి చుక్కెదురు కావడం ఖాయమని వివిధ గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై పట్టు సాధించాలి

- డిజిటల్ లిటరసి శిక్షణ కార్యక్రమం ను సందర్శించిన జిల్లా విద్యాధికారి



**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నందు కోరుట్ల,భిమారం,మేడిపల్లి, కథలాపూర్ మండలాల ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుల డిజిటల్ లిటరసి పై 3 రోజుల శిక్షణ కార్యక్రమం ను మంగళవారం జిల్లా విద్యాధికారి కె.రాము సందర్శించారు. ఆయన మాట్లాడుతూ భౌతిక శాస్త్ర ఉపాద్యాయులు తప్పనిసరి విద్యార్థులకు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై పట్టు సాధించే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కంప్యూటర్ లిటరసి పై అవగాహన కలిగి ఉండే విధంగా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని,ప్రతి విద్యార్థి పై ప్రత్యేకమైన చొరవ చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి కె.రాజేష్,కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం,ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి మధు, ప్రధానోపాధ్యాయులు వి.గంగాధర్, రిసోర్స్ పర్సన్స్ కె.రాజ్ కుమార్ ch.నాగరాజు, సంతోష్ సి.ఆర్.పి లు పి.గంగాధర్,జ్యోతిలు పాల్గొన్నారు.

# మాగంటి సునీతమ్మకే మన ఓటు



- ప్రచారంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ కారు గుర్తుకు ఓటు వేయాలని మంగళవారం ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ. జనసేవకే ప్రాధాన్యతనిచ్చే తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం, కేసిఆర్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు.వాగ్దానాలు కాదు - ఆచరణే బీఆర్ఎస్ పార్టీ అంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలలో ఒక్కటినీ నెరవేర్చలేదని, ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసిందని విమర్శించారు.ప్రజలకు అవగాహన కల్పించేందుకు "కాంగ్రెస్ బాకీ కార్డులు" పంపిణీ చేస్తూ, ప్రజలతో కాంగ్రెస్ వంచనల గురించి వివరిస్తూ, "వాగ్దానాలు కాదు - ఆచరణే బీఆర్ఎస్ పార్టీ నమ్మకం" అని, "తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని గుర్తుగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీకి మీ మద్దతు మరోసారి చాటండి. రాష్ట్ర అభివృద్ధిని కొనసాగించడానికి, ప్రజా సంక్షేమ పథకాలను కొనసాగించడానికి,కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీత గోపినాథ్ భారీ మెజార్టీతో గెలిపించండి"అని పిలుపునిచ్చారు.

# ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన

- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం"ను...ప్రతిఒక్కరు దరఖాస్తు చేసుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్




**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంకు ప్రతిఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు "ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన" పథకాన్ని పట్టణంలోని ప్రతి ఒక్కరి తోటి మెప్మా రిసోర్స్ పర్సన్స్ నమోదు చేయించాలని సూచించారు. ప్రతి సంవత్సరం ఏడాదికి ప్రీమియం రూ.20 రూపాయలు మాత్రమే చెల్లించాలని, 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వయస్సు గల వాళ్లందరూ కూడా దీనికి అర్హులు అని అన్నారు. ప్రమాదవశాత్తు రెండు చేతులు, రెండు పాదాలను ఉపయోగించలేకపోవడం, లేదా ఒక కన్ను చూపు పోవడం, లేదా ఒక చేయి లేదా ఒక పాదం ఉపయోగించలేకపోవడం మరియు బీమా పాక్షిక వైకల్యంపై అయితే ఒక చేయలేదు ఒక పాదం ఉపయోగించలేకపోయినట్లైతే వీరికి అర్హత కల్పిస్తామని అన్నారు. కుటుంబంలో ఎవరికైనా ప్రమాదవశాత్తు మరణం సంబంధించినట్లయితే, ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టినటువంటి ఈ స్కీమును ప్రతి ఒక్కళ్ళు ఉపయోగించుకోవాలన్నారు. జూన్ తేదీ 01 తారీకు నుండి మే31 వరకు ఈ బీమా కవర్ అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద అమెజాన్, మీషో, మీ జొమోటో, ఫ్లిప్కార్ట్ తదితర షాపింగ్ మాల్ లో పనిచేస్తున్నటువంటి సేల్స్ మెన్స్ కూడా అర్హులే అని తెలియజేశారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో సభ్యులను చేర్పించేందుకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్ఞానేశ్వరి, యూనియన్ బ్యాంకు అధికారి నవీన్, మెప్మా టిఎంసి బక్కయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ లో పర్యటించిన నారాయణపేట జిల్లా కలెక్టర్



- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులతో సమావేశం....

**నేటి సాక్షి, నారాయణపేట, అక్టోబర్ 14 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళ వారం పర్యటించి మండలంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మరికల్ మండల కాంప్లెక్ లో జరిగిన పంచాయతీ కార్యదర్శులతో మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పై సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో మండలం వెనకబడి ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రేడింగ్ పూర్తయిన ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారభించాలని ఆదేశించారు. ఇండ్ల నిర్మాణాలలో మండల పనితీరు మెరుగు పర్చేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం కలెక్టర్ మండలంలోని తీలేరు గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగిరం చేయించాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇండ్ల బిల్లుల చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయితే లబ్ది దారుల ఆధార్ అప్ డేట్ లేనందున కొందరికి డబ్బులు చెలించడం ఆలస్యం అవుతున్నాయని తెలపగా ఆధార్ అప్ డేట్ లబ్ధిదారులను బ్యాంక్ కు తీసుకెళ్లి ఎం పీ సి ఎస్ ఫార్మ్ అందజేయాలనీ హౌజింగ్ పీడీ శంకర్ కు ఆమె సూచించారు.గ్రామంలో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహించరాదని, పంచాయతీ సెక్రటరీలు ఉదయం 8 గంటల లోపు విధులకు హాజరైనప్పుడే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ప్రతి పంచాయతీ సెక్రటరీ సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశుద్ధ కార్యక్రమాల పై నిర్లక్ష్యం చేసిన కార్యదర్శులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులకు తమ తమ గ్రామాల పై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని, గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్య పాత్ర అని చెప్పారు. మండల కాంప్లెక్స్ లో మొక్కలు నాటకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్నాయని ఇప్పుడే మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ సెంటర్ లో పని చేస్తున్న మొత్తం సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత నెల జరిగిన ప్రసవాల వివరాలు, ఈ డీ డీ నమోదు ను పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానాలలోనే ప్రసవాలు చేసుకునే విధంగా గర్భిణీలకు అవగాహన కల్పించాలని తెలిపారు. శ్యామ్ మ్యామ్ పిల్లలు ఎంతమంది ఉన్నారని? పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసేందుకు వెళ్తున్నారా? లేదా? అని ఏ ఎన్ ఎం లను ప్రశ్నించారు.

**భారత్ మాల పై ఆరా....**

భారత్ మాలలో భాగంగా మరికల్ కు సంబంధించి ఎంత మంది భూములను కోల్పోతున్నారని, వాటి వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. భూములు కోల్పోయిన వారిలో ఎంతమంది ద్వారా అక్విటెన్స్ తీసుకున్నారని తహసీల్దార్ ను ప్రశ్నించగా, ఇంకా పెండింగ్ లో ఉన్నాయని తెలిపిన తహసిల్దార్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అత్యవసరం పరిస్థితులలోనే సిబ్బందికి సెలవులు ఇవ్వాలని ఆదేశించారు.భూభారతి లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటిలో ఎన్ని క్లియర్ చేశారు ఇంకా ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి ? అని పెండింగ్ దరఖాస్తులను త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ పరిధిలో ఉన్నవాటిని వెంటనే క్లియర్ చేసి పంపాలాన్నారు.

# జిల్లా కలెక్టర్ కృషి స్ఫూర్తిదాయకం-బి దేవర మనోహర్

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** తిరుపతి జిల్లా అభివృద్ధి దిశగా కృషి చేస్తూ ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపడంలో ముందుండి పనిచేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు అందుకోవడం జిల్లాకు స్ఫూర్తిదాయకమని చంద్రగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ను దుశాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దేవర మనోహర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం కింద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వగ్రామం నారావారిపల్లెతో పాటు ఎ.రంగంపేట, కందులవారిపల్లి, చిన్నరామాపురం గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, కేవలం కొద్ది కాలంలోనే 1600 ఇళ్లపై సోలార్ రూఫ్టాప్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిపాలనా నైపుణ్యాన్ని చాటారని ఆయన పేర్కొన్నారు. అధికారులను సమర్థవంతంగా నడిపిస్తూ, నూతన సాంకేతికతను వినియోగించి, ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలను పరిష్కరించడంలో కలెక్టర్ వెంకటేశ్వర్ గారి పాత్ర ప్రశంసనీయమని తెలిపారు. ఇక ఏళ్ల తరబడి పరిష్కారం లభించని శెట్టిపల్లి భూముల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపడం, పలు అభివృద్ధి ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయించడం, గ్రామీణాభివృద్ధి పథకాలకు గణనీయమైన ప్రోత్సాహం ఇవ్వడం వంటి కార్యక్రమాలతో తిరుపతి జిల్లా పరిపాలనలో కొత్త చరిత్ర సృష్టించారని ఆయన అభిప్రాయపడ్డారు.జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజల సమస్యలకు న్యాయం చేయడంలో ముందు వరుసలో ఉండే కలెక్టర్ వెంకటేశ్వర్ స్కోచ్ అవార్డు అందుకోవడం తిరుపతి ప్రజలకు గౌరవకారణం. హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను" అని దేవర మనోహర్ పేర్కొన్నారు.



# నూతన గృహప్రవేశ కర్యక్రమంలో పాల్గొన్న కోలన్ హన్మంత్ రెడ్డి

- నూతన గృహప్రవేశ కర్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్

**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ అక్టోబర్ 14 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ వాసులు పూజారి హనుమయ్య నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి . ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి , శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# పేట డాక్టర్ వినీత్ ఐపీఎస్ గారికి ఘన సన్మానం



**నేటి సాక్షి,నారాయణపేట, అక్టోబర్ 14 :** నారాయణపేట జిల్లా నూతన ఎస్పీ లిడాక్టర్ వినీత్ ఐపీఎస్ గారిని మంగళవారం రోజు జిల్లా ఎస్పీ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆకుల బాలప్ప, మేనుశ్రీ, ప్రభాకర్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ శాఖ మరియు న్యాయ వ్యవస్థ మధ్య సత్సంబంధాలు కొనసాగి, కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంలో సమన్వయం కీలకమని, కేసులు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఎస్పీ తెలిపారు. న్యాయ వ్యవస్థలో పీపీలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, వారితో సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

# రేషన్ డీలర్ల కమిషన్ విడుదల చేయాలి



**నేటి సాక్షి,నల్లబెల్లి ప్రతినిధి అక్టోబర్ 14:** రేషన్ డీలర్ల కమిషన్ విడుదల చేయాలంటూ రేషన్ డీలర్ల సంఘం డిమాండ్ చేసింది.నల్లబెల్లి మండలంలోని రేషన్ డీలర్లు గత ఆరు నెలలుగా కమిషన్‌లు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర, కేంద్ర కమిషన్ బకాయిలు విడుదల కాకపోవడంతో రేషన్ డీలర్లు దుకాణాల నిర్వహణ, రవాణా ఖర్చులు, సహాయకుల వేతనాలు వంటి భారం తమ భుజాలపై వేసుకోవాల్సి వస్తోందని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు యార మధుకర్ తెలిపారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రుణాలు తీసుకుని వ్యవస్థను కొనసాగిస్తున్నామని రేషన్ డీలర్ల సంఘం పేర్కొంది. ఇప్పటికే పలు మార్లు జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలు డీఎస్ఓ, కలెక్టర్, సివిల్ సప్లై కమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఆరు నెలలుగా కమిషన్ రాక రేషన్ డీలర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ కమిషన్ విడుదల చేయాలి. ప్రతి నెలా రవాణా, అద్దె, సహాయకుని వేతనాలు తామే భరించడం ఇప్పుడు అసాధ్యమవుతోంది అని యార మధుకర్ తెలిపారు.రాష్ట్ర కమిటీ బంద్‌కు పిలుపునిస్తే, షాపులను స్వచ్ఛందంగా మూసి సమ్మెలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నామని రేషన్ డీలర్లు హెచ్చరించరు.

# ఏసీబీ వలలో సర్వేయర్..

**రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సర్వేయర్..**



**నేటి సాక్షి ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల: ( కోక్కుల వంశీ ) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపుదాడి చేసి ఓ అవినీతి సర్వేయర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిరిసిల్లలో పనిచేస్తున్న సర్వేయర్ వేణు, ఓ బాధితుడి నుండి లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలలో చిక్కారు. చిన్న బోనాలలో మూడు ఎకరాల భూమికి సంబంధించిన సర్వే పూర్తి చేయడానికి సర్వేయర్ వేణు, బాధితుడిని లంచం డిమాండ్ చేశాడు. మొదటగా ₹10 వేలు తీసుకున్న వేణు, సర్వే పూర్తయిన తర్వాత మరో ₹20 వేలు తీసుకున్న సర్వేయర్ వేణు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో రంగంలోకి దిగారు. బాధితుడు సర్వేయర్ వేణుకు ₹20 వేలు లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.లంచం తీసుకున్న సర్వేయర్ వేణును అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు.

# అక్రమ ఇసుక రవాణా జరగకుండా పకడ్బందీగా చర్యలు

- **జిల్లాలో అక్రమ ఇసుక రవాణా జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లా లో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందిగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారము కలెక్టర్ చాంబర్ లో సంబంధిత అధికారులతో ఇసుక రవాణా పై సమావేశము నిర్వహించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇర్రిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి రిపోర్ట్ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) లింగ్యా నాయక్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ, ఎ.డి.మైన్స్ సత్యనారాయణ, గ్రౌండ్ వాటర్ ఎ డి రవి, ఎ ఓ పర్వీన బేగం,డి సెక్షన్ సుపరిండేన్డెంట్ మున్నిర్, ఇ డి ఎం మహమూద్ , తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జర్నలిస్ట్ క్రికెట్ టీంకు కలెక్టర్ అభినందనలు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) తిరుపతి,అక్టోబర్ 14:** అనంతపురం అంతర్జాతీయ ఆర్డిటి స్టేడియం వేదికగా అక్టోబర్ 5, 6,7, 8 తేదీలలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(జేశాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ - 2025 టోర్నీలో తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లా జట్టు ఛాంపియన్ గా నిలిచిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభినందనలు తెలియజేశారు. మంగళవారం జిల్లా క్రికెట్ జట్టు కలెక్టరేట్ లోని ఆయన చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఛాంపియన్స్ గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ముందు ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామని తెలిపారు. కలెక్టర్ కలిసిన వారిలో జేశాప్ జిల్లా అధ్యక్షులు విజయ యాదవ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, కోశాధికారి నరేష్ రెడ్డి, కెప్టెన్ పులుగూరు శ్రీనివాసులు, క్రీడాకారులు కామేశ్వరయ్య, చిన్నబాబు, వెంకటేష్, మనోహర్, జగదీష్, సుబ్రహ్మణ్యం, సురేష్, ప్రతాప్, నరేష్, మదిఅలగన్, మునిశేఖర్, సతీష్, శ్రీనివాసులు, సాయి తదితరులు ఉన్నారు.

# ఓట్ చోరికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ విజయవంతం

## ఓట్ చోర్ సంతకాల సేకరణ సమతా ప్రకాష్



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 14 :** మహేశ్వరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కందుల సమత ప్రకాష్ మహేశ్వరం నియోజకవర్గం అత్యధికంగా సంతకాల సేకరణ జరిగింది. సామాజిక న్యాయం కోసం ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి పార్టీలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు జ్యోతి భీమ్ భరత్ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే ఓట్ చోరీ కి వ్యతిరేక పోరాటానికి మద్దతుగా ప్రతి గ్రామంలో 100 సంతకాలు సేకరించామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ రాష్ట్రంలోనే మన జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలుపుతూ మహేశ్వరం కాన్స్టెన్సీ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో 10 వేల పైచిలుకు సంతకాల సేకరణ జరిగినట్టు తెలిపారు సంతకాల సేకరణ యొక్క లిస్టును ఈరోజు గాంధీభవన్లో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి బింబారత్ కి అందివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కందుల సమతా ప్రకాష్ బడంగ్పేట్ మున్సిపల్ అధ్యక్షురాలు అమృత నాయుడు మీర్పేట్ అధ్యక్షురాలు పద్మశ్రీ కందుకూరు మండల అధ్యక్షురాలు కవితా రెడ్డి సుశీల ప్రభావతి రవళి సంగీత అరుణ రమాదేవి రజిత నాయకులు మొదలు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రభుత్వ వైద్య కళాశాల లో సిపిఆర్ పై అవగాహన



- **జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల లో సిపిఆర్ పై అవగాహన సదస్సు.**
- **జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పవిత్ర.**



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేద్రం లో ప్రభుత్వ వైద్య కళాశాల లో అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సిపిర్ (కార్డియో పల్మనరీ రిసాసిటిషన్) అవగాహన కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ లోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర , వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామ సుబ్బారెడ్డి వైద్య విద్యార్థులకు సిపిర్ చేసే విధానం గురించి వివరించి సిపిఆర్ ప్రతిజ్ఞ చేయించారు . అనంతరం డాక్టర్ సృజన, డాక్టర్ నిరోషా మ్యాన్, క్వీన్ టాయ్స్ ను ఉపయోగించి సిపిర్ చేసే విధానం గురించి డిమాంస్ట్రేషన్ చేయడం జరిగింది, ఇద్దరు వైద్య విద్యార్థుల చేత సి పి ఆర్ దేమానిస్ట్రేషన్ చేయించడం జరిగింది .డి ఏం & చ్ ఓ మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ వంటి అత్యవసర పరిస్థితులలో తక్షణ స్పందనగా పక్కనున్నవారు సిపిఆర్ విధానం ద్వారా గుండె పనితీరును కొంతమేర సాధారణ స్థితికి తీసుకు రావచ్చని చాలా సందర్భాలలో రోగికి తక్షణ వైద్య సహాయం అందే వరకు ప్రాణాలు కాపాడేందుకు చేసే ప్రయత్నం. ఇలా సిపిఆర్ చేసే ప్రయత్నాల వలన 10 శాతం హార్ట్ ఎటాక్ కేసులను ప్రాణాపాయం నుండి కాపాడవచ్చు అని తెలిపారు. ఈ సి పి ఆర్ పై శిక్షణ అక్టోబర్ 17వ తేదీ వరకు వైద్య సిబ్బందికి, విద్యార్థులకు, వృత్తి నిపుణులకు, సాధారణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. హార్ట్ ఎటాక్ వంటి అత్యవసర పరిస్థితులు ఎవరికైనా రావచ్చుని కాబట్టి ప్రతి ఒక్కరూ సిపిఆర్ గురించి అవగాహన ఏర్పరచు కోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి వి. శ్రీనివాసులు, ఎన్సీడీ సమన్వయకర్త జయ రాములు, డి డి ఎం శ్రీనివాసులు, మహమ్మద్ ఆమిర్, వైద్య కళాశాల సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్సవ విగ్రహంలా గ్రామపంచాయతీ ట్రాక్టర్

## పనిచేయని చెత్త ట్రాక్టర్.... ప్రైవేటు ట్రాక్టర్ తో పనులు చేస్తున్నారు...




**నేటిసాక్షి నారాయణపేట** జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని జిన్నారం గ్రామంలో గ్రామపంచాయతీ కి సంబంధించిన చెత్త టాక్టర్ ఉత్సవ విగ్రహంలా మారిందని జిన్నారం గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామపంచాయతీకి సంబంధించిన డాక్టర్ మూడు నెలల నుండి అలుకు లేదు పలుకు లేదని.... గ్రామంలోని వార్డులలోకి ప్రైవేట్ డాక్టర్లతో చెత్తాచెదారాలను గ్రామస్తులు తెలిపారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ సక్రమంగా పనిచేయడం లేదని గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. నాణ్యతలేని ట్రాక్టర్ గ్రామపంచాయతీకి తీసుకొచ్చార వాపోతున్నారు. .ప్రతిరోజు గ్రామ పంచాయతీ కి సంబంధించిన ట్రాక్టర్ తో చెత్తాచెదారం తొలగించే ఏర్పాట్లు తీసుకోవాలని జిన్నారం గ్రామస్తులు మండల అధికారులను కోరుతున్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం



**నేటిసాక్షి ప్రతినిధి చందుర్తి సతీష్:** చందుర్తి మండలంలోని లింగంపేట గ్రామంలో మంగళవారం సీఎం సహానిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఐదుగురు లబ్ధిదారులకు సంబంధించిన రూ/- 192500 గల చెక్కులను లబ్ధిదారులకు పంపించేశారు. ఈ కార్యక్రమంలో లింగంపేట గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# జూబ్లీ హిల్స్లో ప్రచారం కోసం బి ఆర్ .ఎస్ నాయకులు



**నేటి సాక్షి గన్నవరం, బుర్ర(అంజయ్య గౌడ్) :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో ప్రచార కోసం గన్నేరువరం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు గంప ఎంకన్న మాజీ జెడ్పిటిసి మాడుగుల రవీందర్ రెడ్డి మహేందర్ రెడ్డన్యాత సుధాకర్, ఏ రవి, గూడూరు సురేష్ ముఖ్య నాయకులు తదితరులు తదితరులు

# ఆగిన టిప్పర్ను కారు ఢీకొని బోల్తా

## ఒకరికి తీవ్ర గాయాలు....



**నేటి సాక్షి నారాయణపేట,అక్టోబర్ 14 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామ స్టేజి సమీపంలోని పెట్రోల్ బంకు దగ్గర ఆగి ఉన్న టిప్పర్ను రైచూర్ నుండి వస్తున్న కారు ఢీకొని బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పక్కనే ఉన్న షట్టర్ లోకి వెళ్లడంతో సెటర్ లో ఉన్న వ్యక్తికి ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 లో మహబూబ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
15 అక్టోబర్ 2025



# ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనకు ప్రతిష్ట బందోబస్తు ఏర్పాట్లు




- శ్రీశైల క్షేత్రం చుట్టూ పోలీసుల డేగ కన్నుతో నిఘా...
- ప్రధాని పర్యటించే ప్రాంతాలలో భద్రత మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశాలు జారీ
- నంద్యాల జిల్లా ఎస్పీ .సునీల్ షెరాన్

**నేటి సాక్షి 14 :నంద్యాల జిల్లా అక్టోబర్ శ్రీశైలం :** ఈనెల 16వ తేదీన భారతదేశ ప్రధాని శ్రీ నరేంద్రమోదీ . నంద్యాల జిల్లా శ్రీశైలం నందు పర్యటించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ ఐపీఎస్ , సుమారు 1800 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ ప్రధానమంత్రి హెలిపాడ్ కు చేరుకున్నప్పటి నుండి దర్శనం అనంతరం తిరిగి వెళ్లే వరకు ఆయన పర్యటించు ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహించి ముఖ్యమైన ప్రాంతాలలో మరియు కూడళ్లలో సాయిధ బలగాలతో పికెట్లను ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేయడం జరిగింది.బందోబస్తుకు వచ్చిన సిబ్బందిని 10 సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టార్కు ఒక ఉన్నతాధికారిని ఇన్చార్జిగా నియమించడం జరిగింది.జియో గ్రాఫికల్ మ్యాప్ ద్వారా ప్రధాని పర్యటించే ప్రాంతాలలో తీసుకోవలసిన భద్రత చర్యలను క్షుణ్ణంగా సిబ్బందికి జిల్లా ఎస్పీ గారు వివరించారు.ప్రధాని మంత్రి గారికి భద్రతాపరంగా అత్యంత భద్రత ఉంటుందన్నారు.రోడ్డు మార్గాలలో, ముఖ్యమైన కూడళ్లలో ,గుడి పరిసర ప్రాంతాలలో రూప్ టాప్ సిబ్బందిని నియమించి వారికి బైనాక్యులర్ తో నిరంతరం పరిశీలించాలని ఆదేశించడం జరిగింది.శ్రీశైలానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేయాలని ఇది 24/7 కొనసాగించాలన్నారు. కమాండ్ కంట్రోల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కెమెరాలను పరిశీలించాలని ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.హెలిపాడ్, గుడి, శివాజీ స్పూర్తి కేంద్రం ప్రాంతాలలో ప్రవేశ నిష్క్రమణ మార్గాలలో యాక్సెస్ కంట్రోల్ ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలన్నారు.శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రౌడ్ కంట్రోల్ కొరకు రూప్ టాప్, క్యూఆర్టి, స్పెషల్ పార్టీలను నియమించుకోవాలని ఆదేశించారు.ప్రధాని పర్యటనకు వచ్చిన సుమారు 1800 మంది పోలీస్ అధికారులు సిబ్బందికి ప్రత్యేకమైన డ్యూటీ పాసులను ఆత్రేయ డిజిటల్స్ వారి సహకారంతో ఏర్పాట్లు చేయడం జరిగింది.డ్యూటీలో ఉన్న పోలీసు అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరూ ఐడి కార్డులు ధరించాలన్నారు. రెవిన్యూ అధికారులు ఇచ్చిన ఆసులను క్షుణ్ణంగా తప్పనిసరిగా పరిశీలించాలన్నారు.

# బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు



- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక - ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క.

**నేటి సాక్షి వికారాబాద్ :** బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక – ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖల అధికారులతో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో చదివే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల విద్యార్థుల సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద ఎంపిక చేసిన పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థుల సంక్షేమంపై ఆయా జిల్లాల కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థులకు అందిస్తున్న బోధన, ఆరోగ్యం, మెనూ ప్రకారం భోజనం, ఇతర మౌలిక వసతుల అమలుపై పాఠశాలలను సందర్శించి పరిశీలించాలని తెలిపారు. ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలని, సమస్యల పరిష్కారంపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యాబోధన కొనసాగించాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని (5) బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 1 .సిధార్థ ఎక్సెలెన్స్ హై స్కూల్ వికారాబాద్, 2. కే.వి.ఎం. హై స్కూల్ కుల్కచెర్ల,3. డేఫోఫ్ డీల్స్ హై స్కూల్స్ పరిగి, 4.సెంట్ మార్క్ హై స్కూల్ తాండూర్, 5. కర్ణం వెంకట్రావు మెమోరియల్ హై స్కూల్ కుల్కచెర్ల నందు విద్యా బోధన, విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించాలని, ఆయా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్సు లో డి టి డి ఓ కమలాకర్ రెడ్డి, బి సి వెల్ఫేర్ మాధవ రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెద బుడగ జంగం సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుంది




- బేడ బుడగ జంగం రిజర్వేషన్ సమస్య ప్రధానమంత్రి దృష్టికీ తీసుకెళ్లుతా.లి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నేటి సాక్షి:నంద్యాల జిల్లా పాణ్యం 14 :** బేడ బుడగ జంగం కమ్యూనిటీకి మళ్లీ SC హోదా కల్పించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంకు పంపడం జరిగిందని, తాను కూడా పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వం దృష్టికీ రెండు సార్లు తీసుకెళ్ళానని, మన నంద్యాల జిల్లా పర్యటనకు వస్తున్న భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దృష్టికి కూడా బేడ బుడగ జంగం ఎస్ సి రిజర్వేషన్ సమస్య తీసుకెళ్లుతానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.మంగళవారం నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం శ్రీనివాసనగర్ లోని బుడగ జంగం కాలనిలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పర్యటించి ప్రధాన మంత్రి సభకు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంచార జాతిగా, బిక్షాటనచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని, ఎంతో మంది ఉన్నత చదువులు కూడా చదివారనీ, ఎస్ సి రిజర్వేషన్ ఉండి ఉంటే ప్రభుత్వం ఉద్యోగం సాధించేవారని, చదువుల్లో 98 శాతం మార్కులు వచ్చిన బేడబుడగ జంగం విద్యార్థులు రిజర్వేషన్ లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీకు ఎస్ సి రిజర్వేషన్ కల్పించి న్యాయం చేస్తుందన్న నమ్మకం నాకు ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ఒక పురోగతిశీలమైన చర్యగా జె.సి. శర్మ (ఐ.ఏ.ఎస్ రిటైర్డ్) నేతృత్వంలో ఒక ఏకగుణ కమిషన్‌ను ఏర్పాటు చేసిందనీ, కమిషన్ సమగ్రంగా అధ్యయనం చేసి బేడా బుడగ జంగం సామాజిక, ఆర్థిక, విద్యా నేపథ్యాలను పరిగణనలోకి తీసుకుని, ఈ సామాజిక వర్గాన్ని తిరిగి చేర్చాలని సిఫార్సు చేసిందనీ ఆమె అన్నారు., ఈ ఫైల్ లిరిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా RGI, న్యూ ఢిల్లీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, RGI కార్యాలయంతో దౌత్యంగా చర్చించి, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.ఎలాంటి అనవసర ఆలస్యం లేకుండా, వచ్చే పార్లమెంట్ సమావేశాలలో ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లయితే, బెద బుడగ జంగం సామాజిక వర్గానికి నిజమైన న్యాయం జరుగుతుందనీ, ఇతర జాతులకు లభిస్తున్న రక్షణలు, హక్కులు, ప్రయోజనాలు బేడ బుడగ జంగం కులానికి కూడా అందుబాటులోకి వస్తాయన్న ఆశాభావం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్ రహదారి గుంతలతో ప్రమాదకరం

- ఫ్యూచర్ సిటీ పక్కనే గుంతల రోడ్లు.. కోళ్లపడకల్ ప్రజలకు ఇబ్బందులు

**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 14:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కోళ్లపడకల్ గ్రామంలో సర్పంచులు లేకపోవడంతో,అభివృద్ధి పనులు ఆగిపోయి గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఫ్యూచర్ సిటీకి పక్కన ఉన్న ఈ కోళ్లపడకల్ గ్రామంలో కనీస రోడ్లు కూడా లేవు.ముఖ్యంగా 9,10వ వార్డులో ఈదమ్మ–పోచమ్మ గుడి వైపు వెళ్లే రోడ్డులో గుంతలు,నీరు,బురద తో ప్రమాదకర స్థితి ఏర్పడింది,ఇంటిదగ్గర నుంచి పొలానికి,బజార్ కి వెళ్లాలంటే పాదచారులకు ఇబ్బంది తలెత్తుతోంది.అలాగే గ్రామం నుంచి సిద్ధాపూర్ వైపు రోడ్డు గుంతలతో నిండిపోయింది,దీనికి కారణం కంకర్ మిషన్ మరియు ఇటుకల లారీలు, మట్టి–ఇసుక తరలించే వాహనాలు, పరిమితికి మించిన లోడు మరియు వేగంతో సిద్ధపూర్ టు


హైదరాబాద్ స్పీడుకు మించిన లారీలు వేగం, కారణంగా రోజూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# పీఎం సూర్యఘర్ సక్సెస్ చేయాలి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) తిరుపతి :** ఏపీ సదరన్ డిస్కం నూతన సిఎండి ఎల్. శివ శంకర్ ను మంగళవారం మధ్యాహ్నం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భేటీ అయ్యారు. ఈ భేటీలో మెరుగైన విద్యుత్ అందించేందుకు అవసరమైన విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుపై ఇరువురు చర్చించారు. అలాగే అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నెట్వర్క్ అమలుపై చర్చించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సిఎండి శివ శంకర్ ను కోరారు. సోలార్ విద్యుత్ వినియోగం పెంచడం ప్రభుత్వ లక్ష్యమని తప్పనిసరిగా పీఎం సూర్యఘర్ పథకాన్ని సక్సెస్ చేసేందుకు ప్రయత్నిస్తామని సిఎండి శివ శంకర్ తెలిపారు.

# ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ,షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

జిల్లా ఎస్పి శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్



**నేటి సాక్షి (పూరెళ్ల బాపు)జగిత్యాల టౌన్ : అక్టోబర్ 14 :** శాంతి భద్రతల మరియు సమాజ రక్షణలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా పెట్టి, పోరాడి వీరమరణం పొందిన అమర పోలీసుల జ్ఞాపకార్థం అక్టోబర్ 21 నాడు జరుగు " పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా పోలీస్ రిలేటెడ్ అంశం మీద ఫోటో గ్రఫీ, షార్ట్ ఫిలిం తీయడానికి జిల్లాలో ఆసక్తి గల యువతక ఔత్సహిక ఫోటోగ్రాఫర్లు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ గారు ఒక ప్రకటనలో తెలిపారు.ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తీసిన (3) ఫోటోలు,తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 23 వ తేదీ సాయంత్రంలోగా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో అందజేయాలన్నారు. ఇట్టి షార్ట్ ఫిలిం 3 నిమిషాలు మించకూడదు, 10 x 8 సైజ్ ఫోటోలను, షార్ట్ ఫిలింను పెన్ డ్రైవ్ లో మీ యొక్క పూర్తి వివరాలతో అందజేయలని,జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన మూడు షార్ట్ ఫిలింలను, ఫొటోలను రాష్ట్ర స్థాయి పోటీల గురించి డీజీపీ ఆఫీస్ హైదరాబాదుకు పంపించడం జరుగుతుందన్నారు.

# పప్పు ధాన్యాలు పండించాలి

ఏడిఏ అనిల్



**నేటిసాక్షి : జగదేవపూర్ అక్టోబర్ 14:** పప్పు దినుసులు పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని ములుగు డివిజన్ వ్యవసాయ అధికారి అనిల్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగదేవపూర్ రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత, పోషన్ మిషన్ పథకం కింద రైతులకు రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషన్ మిషన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం యాబై శాతం రాయితీపై రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కొత్త రకం విత్తనాలు కాబట్టి రైతులు పంట సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వరి, పత్తి పంటలకే పరిమితం కాకుండా పప్పుదినుసులపై మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు భాను, కిరణ్, ఖాలీల్, ప్రసన్న, రైతుబంధు జిల్లా మాజీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

# సొంత డబ్బులతో రోడ్డు మరమ్మత్తులు



**నేటి సాక్షి ప్రతినిధి( సుధాకర్ గౌడ్ ముదేలి ) మొయినాబాద్ న్యూస్ :** మొయినాబాద్ మండలంచిన్నమంగళారం నుండి పొద్దటూరు వెళ్లే రోడ్డు మొత్తం గుంతలు కావడం తో గ్రామస్థులు గత కొన్ని నెలలుగా చాలా ఇబ్బంది పడ్తున్నారు ఆ ఇబ్బంది చూడలేక మన ప్రియతమ యువ నాయకులు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ గారు తన సొంత డబ్బులతో మొరం పోయించి రోడ్డు మరమ్మతులు చేయించారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు యువకులు గ్రామస్థులు పాల్గొన్నారు

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# పాఠశాలకు స్మార్ట్ టీవీ, బ్యాగులు అందజేత



**నేటిసాక్షి : జగదేవపూర్ అక్టోబర్ 14 :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జగదేవపూర్ మండల శాఖ అధ్యక్షులు తలారి శ్రీనివాస్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం స్మార్ట్ టీవీని బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు పునాదులు అయినటువంటి ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అయితేనే ప్రభుత్వ విద్యా వ్యవస్థ మనుగడ సాధ్యమవుతుందని, పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20 గా ఉండాలని, ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. మునిగడప కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కాసర్ల కనకయ్య మాట్లాడుతూ పాఠశాలల బలోపేతం కోసం సమాజం యొక్క సహకారం తప్పనిసరి అని తెలియజేశారు. టీవీని పాఠశాలకు ఇచ్చినటువంటి శ్రీనివాస్ ను పాఠశాలకు ఇదివరకే కంప్యూటర్‌ను బహుకరించిన ముత్యాల వేణుగోపాల్ కు పాఠశాలలోని విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన యాదగిరికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధీకొండ శ్రీశైలం, గ్రామస్తుల కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం దాతలకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అనంతసాగర్ ప్రధానోపాధ్యాయులు తుప్పతి రాములు, తిమ్మాపూర్ తాజా మాజీ సర్పంచ్ మాజీ సర్పంచ్ గ్రామ యువకులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.


# పేట జిల్లా స్థాయి అండర్ పోటీలు కబడ్డీ పోటీలు ప్రారంభం

సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత ఎస్. సూర్య మోహన్ రెడ్డి.....



**నేటి సాక్షి,నారాయణపేట, అక్టోబర్ 14 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో 69వ పాఠశాలల జిల్లాస్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలు నిర్వహించడం జరిగింది. కబడ్డీ పోటీలలో గెలుపొందిన వారికి సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి గారు సూర్యచంద్ర ఫౌండేషన్ తరపున మనీ ప్రైస్ ఇవ్వడం జరిగింది. మొదటి బహుమతి 3016 రెండో బహుమతి 2016 అల గర్ల్స్ టీం కి రెండు ప్రైజులు బాయ్స్ టీమ్ కు రెండు రైతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మరికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరీష్ కుమార్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జి చెన్నయ్య,ట్రైసన్ రఘు, రఘుపతి రెడ్డి, జంగిడి రవి ఫయాజ్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ, నారాయణపేట జిల్లా కేంద్రంలోని వివిధ మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుడికి అండగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.



**నేటిసాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 14:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఓ వృద్ధ వికలాంగుడు తన ఇబ్బందులను వివరించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చాడు.ఈ సందర్భంగా మాజీ మంత్రి,మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ని కలసి సహాయం కోరాడు.వికలాంగుడి పరిస్థితి తెలుసుకున్న సబితా ఇంద్రారెడ్డి వెంటనే స్పందించి, వారం రోజుల్లో బ్యాటరీతో నడిచే మూడు చక్రాల వాహనం అందజేస్తాను అని హామీ ఇచ్చారు.అలాగే మీకు,మీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పోరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి,మాజీ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆదిల్ అలీ,పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు

- మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు
- మరికల్ లో బీసీ సంఘం నాయకుల నిరసన



**నేటి సాక్షి నారాయణపేట, అక్టోబర్ 14 :** జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పై ప్రస్తుత జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వివాదస్పదమైన వాక్యాలు చేయడం సరికాదని నారాయణపేట జిల్లా బీసీ సంఘం నాయకులు కానుగంటి నారాయణ అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో అనిరుద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా బీసీ సంఘం నాయకులు కానుగంటి నారాయణ మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గం లో పలు గ్రామాలలో బీసీల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి బీసీ నాయకుడైన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేకర్ పై వాక్యాలు చేయడం సరికాదనివాక్యాలు చేయడం సరికాదని ఆయన విమర్శించారు. జడ్చర్ల నియోజకవర్గంలో మూడుసార్లుగా గెలిచిన ఎర్ర శేఖర్ ని ప్రజలు గౌరవిస్తారని ఆదరిస్తారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేకర్ వస్తున్నారని జీర్ణించుకోలేక అపనిందలు వేయడం సరికాదన్నారు. బీసీ ఓట్లతో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కి బుద్ధి చెప్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మరికల్ మాజీ సర్పంచ్ జగదీష్, పెంట మీది నర్సింలు, తీలేరు అశోక్, లక్ష్మీ రామస్వామి, బొంబాయి కొండన్న, కే కృష్ణయ్య, పండ్ల చంద్రశేఖర్, జంగిడి రాజు, సతీష్, వెంకటేష్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు దుస్తులు,పలకలు పెన్సిల్ పంపిణీ



- చెక్కల మహేష్ కుమార్ ముదిరాజ్, చెక్కల గణేష్ ముదిరాజ్

**నేటిసాక్షి : జగదేవపూర్ అక్టోబర్ 14 :** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల పరిధిలోని బిజీ వెంకటాపూర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక గ్రామ యువకులు చెక్కల మహేష్ , ముదిరాజ్ చెక్కల గణేష్ ముదిరాజ్ ఆర్ఎంపి, డాక్టర్, తన సొంత ఖర్చులతో విద్యార్థులకు మంగళవారం దు-స్తులు పలకల్ పెన్సిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అన్ని విధాలా ఆదుకుంటామని వారు పేర్కొన్నారు. ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సరైన విద్యా అందిస్తూ తెలిపారు ప్రాథమిక పాఠశాలలో ఒకప్పుడు కొద్దిమంది మాత్రమే పిల్లలు ఉండేవాళ్ళు గ్రామస్తులందరూ కలిసి మన గ్రామానికి మన పాఠశాలలో మనమందరం కలిసి కాపాడుకోవాలని నిర్ణయం తీసుకొని ప్రవేటు పాఠశాలలకు పంపే విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడి మన పాఠశాలలో మనం కాపాడుకోవాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కొద్దిమంది ఉన్న విద్యార్థులు 40 మందికి పైగా పిల్లలు చదువుకునే విధంగా కృషి చేశారని ఉపాధ్యాయు లకు ఇబ్బంది కాకుండా ఒక వాలంటరీని పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యను కొనసాగిస్తున్నారు. మన గ్రామ బాగా చదివి మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు విద్యార్థులకు ఎలాంటి అవసరం ఉన్న వారికి అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డు నాయక్, కరుణాకర్ రెడ్డి, స్వరూప , గ్రామ యు-వకులు తదితరులు .

# ‘కార్మిక రాజ్య’ స్థాపనకు కంకణబద్ధులౌదాం

## స్ఫూర్తి నింపిన ‘సిఐటియు’ జిల్లా మహాసభలు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** ‘కార్పొరేటీకరణ.. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించి కార్మిక రాజ్యస్థాపనకు కంకణబద్ధులౌదాం’ అంటూ తిరుపతి జిల్లా సిఐటియు మహాసభ పిలుపునిచ్చింది. కార్మిక హక్కులు, ఉద్యోగభద్రత, కనీస వేతనం సాధించుకునేందుకు సమ-రశీల పోరాటాలు చేసేలా శ్రేణుల్లో స్ఫూర్తి నింపింది. ప్రజా మద్దతుతో కార్మిక ఉద్యమాలను తీవ్రతరం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక హక్కులను కాపాడుకునేలా భవిష్యత్ ఉద్యమాలు ఉంటాయని నూతన నాయకత్వం ప్రకటించింది. తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో వివిఎస్ఎన్ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు సిఐటియు 8వ జిల్లా మహాసభలు జరిగాయి. తొలిరోజు జెండా ఆవిష్కరణతో ప్రారంభమైన మహాసభ రెండో రోజు నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ముగిసింది. ఈ మహాసభ 28 తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించుకుంది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ముగింపు ఉపన్యాసం చేస్తూ విద్యుత్ కార్మికుల సమ్మెకు సిఐటియు శ్రేణులు ప్రత్యక్షంగా బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తూ సంఘాన్ని బలోపేతం చేసేందుకు చారిత్రాత్మక పోరాటాలు చేసిన అంగన్‌వాడీ సంఘం చేదోడువాదోడుగా నిలవాలన్నారు. డిజిటల్ క్యాపిటలిజం నడుస్తున్న ప్రస్తుత తరుణంలో స్విగ్గీ, జొమాటో సంస్థలు యువతను శ్రమదోపిడీ చేస్తున్నాయన్నారు. ఈ దోపిడీని గుర్తించిన యువత గుంటూరు, విశాఖపట్నంలో సమ్మెకు దిగాయని, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతిలోనూ వేలాదిమందిని కదిలించేలా చూడాలని కోరారు. గత ప్రభుత్వంలో ఐదువేల రూపాయలకే వాలంటీర్లు పనిచేశారని, కూటమి ప్రభుత్వం వీరిని విస్మరించిందన్నారు. వారి తరపున పోరాడుతున్న ఏకైక సంఘం సిఐటియు అన్నారు. వాలంటీర్లను కదిలించాలన్నారు. ఆబ్కాస్ ఉద్యమాలు తిరుపతిలో అనుకున్న స్థాయిలో జరిగాయని, రాష్ట్రంలో అంతగా లేదన్నారు. తిరుపతిని ఆదర్శంగా రాష్ట్రం తీసుకుంటుందన్నారు. విజయాలను, లోపాలను ఎప్పటికప్పుడు సంఘం గుర్తించి భవిష్యత్ ఉద్యమాలకు బాటలు వేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ సిఐటియు జిల్లా మహాసభలు పుత్తూరు పట్టణంలో జయప్రదంగా జరిగాయన్నారు. రెండు రోజుల పాటు 28 తీర్మానాలను చర్చించి, ఆమోదించుకున్నామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పర్మినెంట్ కార్మికులు పాల్గొన్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించేలా పోరాటాల రూపకల్పన జరిగిందన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిన చంద్రబాబు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమించాలని మహాసభ తీర్మానం చేసిందన్నారు. 23 మందితో జిల్లా ఆఫీసు బేరర్స్, 56 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవమయ్యిందన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, ఇ.శివకుమార్, ఆర్.వెంకటేష్, వందవాసి నాగరాజు, అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, జి.బాలసుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, వాణిశ్రీ, కెవిఎల్ ప్రసాద్, రామకృష్ణ, మునిరాజా, వేణుగోపాల్, మాధవకృష్ణ, బుజ్జి పాల్గొన్నారు.

# సూపర్ జిఎస్టి 2.0 ప్రయోజనాలను ప్రజలకు తీసుకెళ్లండి

## డిప్యూటీ కమిషన్ అమరయ్య



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** సూపర్ జిఎస్టి 2.0 తగ్గింపు వలన కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమ-రయ్య సిబ్బందికి సూచించారు. సూపర్ జిఎస్టి 2.0 తగ్గింపు వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలు వివరించే విధానంపై నగరపాలక సంస్థ, జిఎస్టి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జిఎస్టి వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ఇప్పటికే పలు రకాలుగా ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సిబ్బంది అందరూ కృషి చేయాలి అన్నారు. దీపావళి వరకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జి.ఎస్.టి. పన్ను రేటును రెండు స్లాబ్‌లుగా మార్చాయని, అంటే 28శాతం నుండి 18 శాతం మరియు 12 నుండి 5 శాతం కి తగ్గించబడిందని తెలిపారు. అలాగే కొన్ని వస్తువులు 0% అమలులోకి వచ్చాయని తెలిపారు. ఈ విషయాలను అధికారులు, సిబ్బంది విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. సూపర్ జి.ఎస్.టీ 2.0 తగ్గింపుని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ వరలక్ష్మి, రెవిన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, డిప్యూటీ సిటీ ప్లానర్ ఖాన్, ఏసీపీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
15 అక్టోబర్ 2025


# కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



- **కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి**

**నేటి సాక్షి (భూమయ్య) మెదక్ జిల్లా. కొల్చారం :** మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కొంగోడు నాయిని జలాల్పూర్ అంశానిపల్లి కొల్చారం పోతంశెట్టిపల్లి వరిగుంతం గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ నియోజకవర్గపు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి గారు ప్రభుత్వ లాంఛనంగా కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది అనంతరం ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దళారి వ్యవస్థ నిర్మూలించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అందరికీ తెలిసిందే దీనికి మద్దతు ధర క్వింటాల్కు 2389 రైతులకు ఇవ్వడం జరుగుతుంది గత యాసంగి పంటకి సన్నబడ్లకి 500 రూపాయలు క్వింటాలకి ఇస్తామని ప్రభుత్వం ఒప్పుకుంది కానీ మన మెదక్ జిల్లా వ్యాప్తంగా 32 కోట్లు బోనస్ ఇవ్వలేదని కేవలం నర్సాపూర్ నియోజకవర్గానికి 8 కోట్ల రూపాయలు సన్న వడ్లకి 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించడం జరిగింది తదనంతరం ప్రభుత్వం రైతులకు మేలు జరిగేలా వెంట వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సందర్భంగా లారీలను తెప్పించి వరి ధాన్యం ఆగకుండా రైతులకు మేలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ కొల్చారం మండల అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్తా మరియు జిల్లా నాయకులు ఇంద్రసేనారెడ్డి వేమారెడ్డి నరేందర్ రెడ్డి సత్యనారాయణ గౌడ్ పెద్ద సంజీవులు సంతోష్ కుమార్ రవితేజ రెడ్డి నాగేశ్వరరావు మరియు మండల నాయకులు మల్లేశం పిఎసిఎస్ సీఈవోలు సాయి రెడ్డి ఆంజనేయులు రాములు డైరెక్టర్లు పండరి శేషగిరి మాజీ ఎంపీటీసీలు సిద్ధిరాములు మాజీ సర్పంచులు యాద గౌడ్ నెల్లి కిష్టయ్య ఎంపీడీవో రఫీకున్నిసా బేగం ఆర్ ఐ ప్రభాకర్ ఏవో శ్వేతకుమారి ఏ ఈ ఓ స్రవంతి జిపిఓ పద్మ పంచాయతీ కార్యదర్శి మౌనిక మరియు ప్రజా ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు

# మేడిపల్లి మండలంలో గంజాయి పట్టివేత




**నేటి సాక్షి (పూరెళ్ల బాపు) జగిత్యాల :** (అక్టోబర్ 14):జగిత్యాల జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామ శివారులో మంగళవారం గంజాయి పట్టుకున్నట్లు మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు.మేడిపల్లి పోలీసు వారికి మేడిపల్లి గ్రామ శివారులో ఒక వ్యక్తి అతని పేరు బద్దం నాగరాజు s/o సాయి రెడ్డి, 26 yrs, గుడేటి కాపు r/o తాండ్రియాల v/o కథలాపూర్ మండలం అనుమానంగా కనిపించగా అతన్ని తనిఖీ చేయగా అతని వద్ద 200 గ్రాముల గంజాయి దొరికినది. అట్టి వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.గంజాయి గురించి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు అందించాలని ఆయన కోరారు. గంజాయి కలిగి ఉన్నా, విక్రయించినా, సరఫరా చేసినా, వారికి సహకరించినా చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు.గంజాయి పట్టుకున్న మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డిని, కానిస్టేబుల్ నాగరాజుని మరియు సిబ్బందిని SP అశోక్ కుమార్ ఐపీఎస్, మెట్పల్లి DSP A. రాములు, కోరుట్ల CI B. సురేష్ బాబు అభినందించారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పాలి



- **మంత్రి పొన్నం ప్రభాకర్ భర్తను కోల్పోయిన బాధల్లో ఉన్న క్షమాపణలు చెప్పాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి**

**నేటి సాక్షి (భూమయ్య) మెదక్ జిల్లా. కొల్చారం :** జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత ను అవమానించేలా మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కొల్చారం మండల పర్యటనకు వచ్చిన సునీత లక్ష్మారెడ్డి వరిగుంతంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు భర్తను కోల్పోయిన బాధలో ఉన్న బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత బాధతో ఏడిస్తే సినిమాలో నాటకాల ఏడుపు ఏడుస్తున్నట్లు అనడం సిగ్గుచేటు అన్నారు. భర్తను కోల్పోయిన బాధలో ఉన్న మహిళను ఆదరించి అండగా ఉండాల్సింది పోయి అవమానించే లా మాట్లాడడం సరికాదన్నారు. మంత్రి పొన్నం వెంటనే తన మాటలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పకుంటే మహిళా కార్యకర్తలతో కలిసి మంత్రి పొన్నం ఇంటిని ముట్టడిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్చరించారు. రాష్ట్రంలో మంత్రుల తీరు పై అసహనం వ్యక్తం చేశారు. తమ తోటి మంత్రులను సైతం మహిళలు, అట్టడుగు వర్గాలకు చెందిన వ్యక్తులు అన్న బేధం లేకుండా వ్యంగ్యంగా మాట్లాడుతున్నారన్నారు ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యురాలు ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి మాది జెడ్పిసి శ్రీనివాస్ రెడ్డి టిఆర్ఎస్ నాయకులు నరేందర్ రెడ్డి ముత్యం ప్రవీణ్ తాజా మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసి లు పార్టీకి చెందిన మహిళా కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# దేవాలయ స్థలం ఆక్రమణపై వెంటనే చర్యలు తీసుకోవాలి



హనుమాన్ దేవాలయ స్థలం ఆక్రమణపై వెంటనే చర్యలు తీసుకోవాలి – భారతీయ జనతా పార్టీ లి

**నేటి సాక్షి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జల్పల్లి సమీపంలోని అతి పురాతన హనుమాన్ దేవాలయ స్థలం కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించారు. ఈ విషయం పై గతంలోనే పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ మరియు జల్పల్లి మున్సిపల్ కమిషనర్ కి స్థానిక హిందూ భక్తులు మరియు నాయకులు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ అన్నారు హనుమాన్ దేవాలయ స్థలాన్ని కబ్జా చేసి కూడా ప్రభుత్వం మౌనంగా ఉండటం అత్యంత దారుణం. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హిందూ దేవాలయం స్థలం కబ్జా చేయబడినా చూస్తూ ఊరుకోవడం ఎవరి మెప్పుకోసం? ప్రజలకు సమాధానం చెప్పాలి కొంతమంది బిఆర్ఎస్ నాయకులు మేము కూడా హిందువులం అని ప్రెస్ మీట్లు పెట్టడం కాదు ఇలాటి సమస్య వచిన్నపుడు మందుకురావాలి ఎన్నికల సమయంలో దొంగ జీవోలు, వాగ్దానాలు, ముసుగులు ధరించి ఓట్లు దోచుకున్నవారు ు ఇప్పుడు హిందూ దేవాలయాలను మట్టిలో కలపడానికి ప్రయత్నించడం ప్రజల భావోద్వేగాలపై దాడి భారతీయ జనతా పార్టీ స్పష్టంగా హెచ్చరిస్తోంది ు హనుమాన్ దేవాలయ స్థలం కబ్జా చేసే ప్రయత్నాలు వెంటనే ఆపాలి. ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ తక్షణం విచారణ ప్రారంభించాలి. హిందూ దేవాలయాలపై దాడులు కొనసాగితే బీజేపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఉద్యమం చేపడుతుంది. సనాతన ధర్మాన్ని, హిందూ దేవాలయాలను రక్షించడం భారతీయ జనతా పార్టీ ధర్మం.హనుమాన్ దేవాలయాల జోలికొస్తే కాంగ్రెస్ అయినా, బిఆర్ఎస్ అయినా ఖబర్దార్! ఈ కార్యక్రమంలో జలపల్లి మున్సిపల్ అధ్యక్షులు మనోజ్ బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి గురిగే శ్రీకాంత్ బాలా శివుడుగౌడ్ గౌరా మురళి రావుల భరత్ హరికృష్ణ గుర్రం శివ రాకేష్ రవి కొంతం మురళీధర్ రెడ్డి రామాచారి కళ్లెం మురళీధర్ రెడ్డి ప్రవీణ్ గౌడ్ పవన్ పటేల్ సతీష్ నందా నరసింహ మల్లెల మహేందర్ మరియు తదితరులు పాల్గొన్నారు

# పారిశుద్ధ్య కార్మికులకు నిత్యవసరాల పంపిణీ



**నేటి సాక్షి (జిన్నారం :** జిన్నారం మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నటువంటి పారిశుద్ధ్య కార్మికులు ఒక నెల సరిపడ కిరాణా సామాగ్రి, బియ్యము, సబ్బులు, ఇతరత్రా సామాను, అందించిన బిజెపి నాయకుడు పూడూరు సుధాకర్, బిజెపి సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ నెంబర్. ఈ కార్యక్రమంలో ఏర్పుల వీరేష్, డప్పు ప్రవీణ్, కాషా అంజనేయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏబుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ రెండవ రోజు శిక్షణ



**నేటి సాక్షి,నారాయణపేట, అక్టోబర్ 14 :** ఏబుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరగిద్ద రెండవ రోజు ఈ శిక్షణ ఉద్దేశించి స్టేట్ రిసోర్స్ పర్సన్ శంకర్ సంగం మాట్లాడుతూ నూతనంగా ఆరో తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ ప్రవేశపెట్టడం జరిగిందని సంగంఈ శిక్షణలో ఉపాధ్యాయులు కోడింగ్ డాటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజైన్ థింకింగ్ డిజిటల్ సిటిజెన్షిప్ అనే అంశాలపై శిక్షణ ఉంటుందని ఇక్కడ నేర్చినటువంటి అంశాలను విద్యార్థులకు బోధించినచో విద్యార్థులకు ఉపయోగపడుతుందని విద్యార్థులకు 21 సెంచరీలో స్కిల్స్ రావాలని ఇక్కడ నేర్చినటువంటి అంశాలను విద్యార్థులకు బోధించి విద్యార్థులలో జీవనోపాధికి ఉపాయం పడే నైపుణ్యాలను విద్యార్థులకు రావాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష జిల్లా సైన్స్ అధికారి హెచ్ భాను ప్రకాష్ మరియు రిసోర్స్ పర్సన్ అమృత్ తిప్పన నయుం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# 20వేల పైచిలుకు సంతకాల సేకరణ

**జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్**



**శంకర్‌పల్లి:** అక్టోబర్ 14: ( నేటి సాక్షి): ఓట్ చోరికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ విజయవంతం అయిందని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 20వేల పైచిలుకు సంతకాల సేకరణ జరిగింది. సామాజిక న్యాయం కోసం ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ గారు చేస్తున్న పోరాటానికి పార్టీలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు పిలుపు మేరకు శ్రీజ్యోతి భీమ్ భరత్ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే! ఓట్ చోరికి వ్యతిరేక పోరాటానికి మద్దతుగా ప్రతి గ్రామంలో 100 సంతకాలు సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నుంచి నాయకులు మొదలు కార్యకర్తలు దాకా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేశారన్నారు. ఈ విజయానికి నాతో పాటు సహాయా సకరాలు అందించిన జిల్లా నాయకురాళ్ళు, నియోజకవర్గ అధ్యక్షురాలు, బ్లాక్ మండల మున్సిపల్, అధ్యక్షురాలు కార్యకర్తలకు శ్రీజ్యోతి బీమ్ భరత్ ధన్యవాదాలు తెలియజేశారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
16
బుధవారం
15 అక్టోబర్ 2025

# కబ్జాపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందన



- బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం స్థలం కబ్జాపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందన

**నేటి సాక్షి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 :** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బేడ బుడగ జంగం స్థానిక సంక్షేమ సంఘం స్థలంను కాంగ్రెస్ నాయకుడు కమోజీ తిరుపతయ్య కబ్జా చేసినట్టు సంఘం సభ్యులు ఆరోపించారు. సంఘానికి చెందిన స్థలంలో డబ్బాలు ఏర్పాటు చేయడంతో, వాటిని తొలగించాలని పలుమార్లు కోరినా స్పందించకుండా తిరుపతయ్య ఇది నా స్థలం, ఏం చేసుకుంటారో చేసుకోండి అని బెదిరింపులకు దిగారని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై సంఘం సభ్యులు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వెంటనే ఎమ్మార్వోతో మాట్లాడి, ఆ స్థలంపై ఏర్పాటైన డబ్బాలను తొలగించి సంఘం సభ్యులకు తిరిగి అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, భూపేష్ గౌడ్, సిద్దాల బీరప్ప, శ్రీను నాయక్, సంఘం అధ్యక్షులు పవన్ కుమార్ మరియు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం



**నేటి సాక్షి నారాయణపేట, అక్టోబర్ 14 :** నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని ఎంపిక ప్రక్రియలో భాగంగా మంగళవారం సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం, నర్వ మండల కేంద్రంలో ఏఐసీసీ పరిశీలకులు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణ స్వామి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి, మక్తల్ నియోజకవర్గ బ్లాక్ లోని నర్వ మరియు ఉట్కూర్ మండలాలకు సంబంధించిన సీనియర్ నాయకులతో నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే.ప్రశాంత్ కుమార్ రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉంగరాల వెంకట్ రెడ్డి ఆధ్వర్యం లో ఏఐసీసీ పరిశీలికులు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామికి కండువాతో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, జిల్లాడీసీసీ కార్యవర్గం, నర్వ, ఉట్కూర్ మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల్ ఉపాధ్యక్షునిగా.. అమీర్పేట యాదగిరి ముదిరాజ్

పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన చెందిన అమీర్పేట యాదగిరి ముదిరాజ్



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం అక్టోబర్ 14:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన అమీర్పేట యాదగిరి ముదిరాజ్.. బిజెపి మండల కమిటీలలో.. ఏకగ్రీవంగా మహేశ్వరం మండల వైస్ ప్రెసిడెంట్గా నియమించడం జరిగింది.. యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ... బిజెపి పార్టీ బాధ్యతలు అప్ప చెప్పినందుకు గాను తప్పకుండా సేవ చేసుకునే అవకాశం ఇచ్చిన కమిటీ సభ్యులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ.. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలలో.. బిజెపి పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని తెలియజేస్తూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో.. బిజెపి పార్టీ నుండే అధిక సంఖ్యలో అభ్యర్థులు గెలిచి.. ముందుకు వెళుతుందని.. తెలియజేస్తూ.. నాతో ఉన్న కార్యకర్తలను అభిమానులను బిజెపి నాయకులను.. ప్రతి ఒక్కరిని కలుపుకొని.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ యొక్క బాధ్యతను అప్పజెప్పినందుకు మండల సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసిన యాదగిరి ముదిరాజ్

## విజయవాడ కనకదుర్గమ్మ తల్లి దర్శనం చేసుకున్న..

శంకర్పల్లి మండలం బిజెపి యూత్ అధ్యక్షుడు షణ్ముఖప్ప



**శంకర్పల్లి, అక్టోబర్ 14( నేటి సాక్షి)** శంకర్పల్లి మండల పరిధి మోకిల గ్రామ నివాసి అయిన మండల బిజెపి యూత్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గమ్మ తల్లి దర్శనం చేసుకోవడం జరిగింది. ఆ తర్వాత వారు మాట్లాడుతూ కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజల పైన ఉండాలని కోరుకున్నాడు. బిజెపి పాలిత రాష్ట్రాలు ఏవిధంగా అభివృద్ధి చెందుతున్నాయో తెలంగాణ రాష్ట్రం కూడా ఆ విధంగా బిజెపి ప్రభుత్వం వస్తే అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న నిస్వార్థమైన పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు అని తెలిపారు. నరేంద్ర మోడీ భారతదేశానికి ఒక వెన్నుముక లాంటోడు అని తెలిపారు. ప్రపంచ పటంలో భారతదేశానికి ఒక గుర్తింపు తీసుకో వచ్చిన వ్యక్తి అభినవ మన్యుడు మన నరేంద్ర మోడీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి యాదయ్య, రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డి, పార్లమెంటు ఇన్చార్జి మైలారం వెంకటేష్, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## “గ్రేట్ ప్లేస్ టు వర్క్”గా అధికారిక గుర్తింపు



**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ అక్టోబర్ 14 :** ఫార్మా దిగ్గజం అరబిందో ఫార్మా 100% సబ్సిడీరీ సంస్థ అయిన అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కు అరుదైన గుర్తింపు లభించింది. ప్రతిష్టత్మక గుర్తింపు అయిన “గ్రేట్ ప్లేస్ టు వర్క్”గా అధికారిక గుర్తింపు పొందినది. ఈ సందర్భంగా గడ్డపోతారం లో గల ఆపిటోరియా ఫార్మా యూనిట్ 2 లో ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు. ఉద్యోగుల సమిష్టి కృషికి నేడు గుర్తింపు ఆపిటోరియా యూనిట్ 2 ప్లాంట్ హెడ్ శరత్ సూరత్ సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి సమిష్టి కృషివల్ల ఈ గుర్తింపు సాధ్యనెయ్యిందని ఆపిటోరియా యూనిట్ 2 ప్లాంట్ హెడ్ శరత్ సూరత్ అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు మా సానుకూల, సమానత్వంతో కూడిన మరియు శక్తివంతమైన కార్యసంస్కృతిని పెంపొందించాలన్న అంకితభావానికి నిదర్శనం అని అన్నారు.. ఈ మైలురాయిని సాధించిన మా అద్భుతమైన బృందానికి హృదయ పూర్వక కృతజ్ఞతలతో ఈ విజయాన్ని ఆనందంగా ఈరోజు జరుపుకున్నామని ఆయన అన్నారు.

## ఘనంగా పుట్టినరోజు వేడుకలు



**నేటి సాక్షి గన్నేరువరం : (బుర్ర అంజయ్య గౌడ్ ):** గన్నేరువరం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు ముసుకు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మైసం పల్లి తిరుపతి గారి పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మూసుకు ఉపేందర్ రెడ్డి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు మాతంగి అనిల్

## చారాల ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా గణాంక అధికారి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య గణాంకాధికారి జార్జి సందర్శించారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మాత శిశు మరణాలను అరికట్టాలన్నారు ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భవతులను గుర్తించి వారూ జన్మించబోయే శిశువు ఆరోగ్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు అందుకోసం ఆరోగ్యం పౌష్టికాహారం పై గర్భవతులు బాధితులకు అవగాహన కల్పించాలన్నారు ముఖ్యంగా అధిక ప్రమాదం స్థితిలో ఉన్న గర్భవతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు గ్రామీణ ప్రాంతాల్లో సందర్శించి అందరి ఆరోగ్య భద్రత బాధ్యతలు తీసుకొని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు అనంతరం విలేజ్ క్లినిక్ లో జరుగుతున్న పలు ఆరోగ్య విషయాలపై చర్చించారు ఈ కార్యక్రమంలో డిపిఎం రామ్మోహన్ ఏఎన్ఎంలు ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు


## నారంగారి సిద్ధమ్మకు చెవిరెడ్డి లక్ష్మీ నివాళులు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** చంద్రగిరి పట్టణంలోని రెడ్డివీధికి చెందిన నారంగారి సిద్ధమ్మకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ నివాళులు అర్పించారు. మంగళవారం ఆకస్మికంగా మరణించిన ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆమె కుమారుడు నారంగారి మదనమోహన్‌రెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పారు. చెవిరెడ్డి లక్ష్మీతో పాటు తుమ్మలగుంట గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఆ ఇంటికి చేరుకుని సిద్ధమ్మకు నివాళులు అర్పించారు.

## గృహప్రవేశ పూజలో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పెద్దిరెడ్డి సుజాత

బాచుపల్లి మాజీ వార్డ్ సభ్యులు కొత్త పల్లి పూజారి గృహప్రవేశ పూజలో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పెద్దిరెడ్డి సుజాత



**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ అక్టోబర్ 14 :** బాచుపల్లి మాజీ వార్డ్ సభ్యులు కొత్త పల్లి పూజారి నూతన గృహప్రవేశ పూజ కార్యక్రమంలో పాల్గొని వారికీ శుభాకాంక్షలు తెలియచేసిన నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పెద్దిరెడ్డి రెడ్డి సుజాత, నాయకులు కాదరయ్య, మల్లేష్, మహేందర్ (మున్నా ), శ్రీమాత యజమానులు మహేందర్, తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ బంద్ ను విజయవంతం చేయండి

సీపెల్లి శంకరా చారి



**నేటి సాక్షి, ఎండపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను అడ్డుకుం టున్నందుకు నిరసనగా ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలోని బీసీ ఐకాస ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన తెలంగాణ రాష్ట్ర వ్యాప్త బంద్ ను విజయవంతం చేయాలని ఎండపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సీపెల్లి శంకరా చారి విజ్ఞప్తి చేశారు. బీసీ ఐకాస కి మద్దతుగా మండలంలోని బీసీ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల, బీసీ నాయకుల సహకారంతో ఈనెల 18వ తేదీన బంద్ ను విజయవంతం చేయడానికి త్వరలో ఎండపల్లి మండలం లోని అన్ని వెనుకబడిన కులాల మండల అధ్యక్షులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సీపెల్లి శంకరా చారి తెలిపారు. బీసీ హక్కుల సాధన కోసం ప్రతి ప్రతి బీసీ బిడ్డ నాది అనుకొని, వెనుకబడిన తరగతుల వారి హక్కుల కోసం నడుం బిగించాల్సిన సమయం వచ్చిందని ఆయన విజ్ఞప్తి చేశారు.